

కళాకారిణి నృత్యభంగిమ

లేపాక్షిలో వైభవంగా గుడి సంబరాలు

- ప్రాచీన కళ ఉట్టిపడేలా నృత్యాలు
- వేలాదిగా తరలివచ్చిన జనం
- హాజరైన నందమూరి వసుంధరాదేవి

పరంపర సంస్థ సౌజన్యంతో కావూరి కుటుంబస భ్యులు, ఎమ్మెల్యే నందమూరి బాలకృష్ణ, వసుంధ రాదేవి సహకారంతో లేపాక్షిలో ఆదివారం గుడి సంబ రాలు అంబరాన్నంటాయి. మరుగున పడిన ప్రాచీన కళలను భావితరాలకు అందించాలన్న లక్ష్యంతో పరంపర సంస్థ ప్రాచీన ఆలయ గుడి సంబరాలను నిర్వహిస్తోంది. వారసత్వాన్ని భవిష్యత్తుతరానికి అందించాలన్న సంకల్పంతో దేశంలోని ప్రాచీన కళలు గుర్తుతెచ్చేలా ఆదివారం రాత్రి గుడి సంబరాలు నిర్వహించారు. ఆదినృత్యం, అన్నమయ్య కీర్తనలు, మృదువైన లిరి కల్ సింబాలిజం, కూచిపుడి, భరత నాట్యంతో కళాకారులు అలరించారు. నృత్య ప్రదర్శన ఉత్రూతలూగించింది. కార్యక్రమాన్ని వీక్షించడానికి వేలాదిగా జనం తరలివచ్చారు.

హిందూపురం/లేపాక్షి



గుడిసంబరాలకు హాజరైన జనం

అంబరాన్నంటిన సంబరం





హిందూపురం, ఫిబ్రవరి 4: మరుగున పడుతున్న ప్రాచీన కళలు, తెలుగు సంస్కృతీసంప్ర దాయాలు భావితరాలకు అందించాల్సిన అవ సరం ఎంతైనా ఉందని హిందూపురం ఎమ్మెల్యే నందమూరి బాలకృష్ణ సతీమణి నంద మూరి వసుధరాదేవి పేర్కొన్నారు. ఇందుకు నడుం బిగించిన పరం పర లక్ష్యం అమోఘమైందని కొని యాడారు. ఆదివారం లేపాక్షి ఆలయం ఎదురుగా పరంపర సంస్థ కావూరి కుటుంబసభ్యుల ఆధ్వ ర్యంలో నందమూరి బాలకృష్ణ, వసుం ధరాదేవి సహకారంతో డ్యాన్స్ కంపెనీ ఆధ్వర్యంలో నృత్యప్రదర్శన చేపట్టారు. కార్య క్రమాన్ని నందమూరి వసుంధరాదేవి జ్యోతి ప్రజ్వలన చేసి, ప్రారంభించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ.. నృత్యం, నాటకం, సంగీతానికి దేశంలో ఆధ్యాత్మిక ప్రాముఖ్యత ఉందన్నారు. దేశంలోని ప్రాచీన ఆలయాలవద్ద ఇలాంటి సంబరాలు నిర్వహించడం హర్షణీయమన్నారు. టీడీపీ హయాంలో లేపాక్షి ఉత్సవాలు నిర్వహించడం ద్వారానే

సంస్కృతీసంప్రదాయాలు భావితరాలకు అందిద్దాం

ఆలయ విశిష్టత ప్రపంచానికి తెలిసిందన్నారు. అప్పట్లో లేపాక్షి ఉత్సవాలు నిర్వహించేందుకు టీడీపీ అధినేత చంద్రబాబు నాయుడు, ఎమ్మెల్యే నంద మూరి బాలకృష్ణ ఎంతగానో కృషిచేశారని గుర్తుచేశారు. లేపాక్షి ఉత్సవాల కారణంగా పర్యాటకుల సంఖ్య పెరిగిందన్నారు. భవిష్యత్తులో కూడా లేపాక్షి ఆలయ అభివృద్ధికి తనవంతు కృషిచేస్తారన్నారు. కార్యక్రమంలో టీడీపీ కోఆర్డినేటర్ శ్రీనివాసరావు, మునిసిపల్ మాజీ చైర్‌పర్సన్ రావిళ్ల లక్ష్మి, నాయకులు నాగరాజు, జయప్ప, అశ్వత్థనారాయణరెడ్డి, రమేష్, బేవన హళ్లి ఆనంద్, కిష్టప్ప, ఆదినారాయణ, అంబికా లక్ష్మీనారాయణ సతీమణి శ్యామల, ఎన్‌బీకే హెల్పింగ్ హ్యాండ్స్ అధ్యక్షుడు అనంతపురం జగన్ పాల్గొన్నారు.

ప్రాచీన కళలను కాపాడాల్సిన అవసరం ఉంది
లేపాక్షి విశిష్టతను ప్రపంచానికి చాటింది టీడీపీనే
గుడి సంబరాల్లో నందమూరి వసుంధరాదేవి



హాజరైన వారు



కళాకారుల నృత్య ప్రదర్శన



జన సందోహం



జ్యోతి ప్రజ్వలన చేస్తున్న వసుంధరాదేవి

నేడు కలెక్టరేట్‌లో స్పందన

పుట్టపర్తి రూరల్, ఫిబ్రవరి 4: స్థానిక కలెక్టరేట్‌లో సోమవారం జిల్లాస్థాయి స్పందన అర్జీల స్వీకరణ కార్యక్రమం నిర్వహించనున్నట్లు కలెక్టర్ అరుణ్‌బాబు ప్రకటనలో తెలిపారు. ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

శత వసంతాల కమలమ్మ



వందేళ్ల వృద్ధురాలికి కేక్ తినిపిస్తున్న కుటుంబికులు

రొద్దం, ఫిబ్రవరి 4: మండలంలోని పెద్ద గువ్వలపల్లికి చెందిన ఈడిగ కమలమ్మ శత వసంతాల వేడుక కుమారులు, కుమార్తెలు, బంధు వులు ఘనంగా నిర్వ హించారు. మండలం లోని ఆర్.మరువపల్లి సమీపాన గల తోటలో కమలమ్మ శతజయంతి ఉత్సవా లను ఆదివారం ఏర్పాటు చేశారు. కేక్ కట్‌చేసి సంబరాలు, జరుపుకున్నారు. వృద్ధురా లికి కుమారులు రంగస్వామి, శ్రీనివాసులు, జనార్దన్, ఇద్దరు కుమా ర్తెలు ఉన్నారు. వందేళ్ల వయసులోనూ కమలమ్మ ఆరోగ్యంగా ఉంటూ తన పని తాను చేసుకుంటున్నారని బంధువులు హర్షం వ్యక్తం చేశారు. వెయ్యి మందిదాకా బంధు వులు, స్నేహితులు విచ్చేసి విందు చేసుకున్నారు. కార్యక్రమంలో టీడీపీ పెనుకొండ నియోజక వర్గ కమిటీ అధ్యక్షుడు చిన్నప్పయ్య, గుట్టూరు సుబ్బరాయుడు పాల్గొన్నారు.

కరెంటు కష్టాలు..!

- లోఓల్టేజీతో ఎండుతున్న వేరుశనగ
- ఆందోళనలో అన్నదాతలు
- పట్టించుకోని ట్రాన్స్‌కో అధికారులు





ఎండిముఖం పట్టిన వేరుశనగ పంట

ముదిగుబ్బ, ఫిబ్రవరి 4: ఖరీఫ్‌లో వర్షాభావంతో పంటలు కోల్పోయి, అన్న దాతలు తీవ్రంగా నష్టపోయారు. రబీలోనైనా బోర్ల కింద పంట వేసుకుని, ఉపశమనం పొందుదామనుకున్నారు. కరెంటు రూపంలో అన్నదాతకు కొత్త కష్టం వచ్చిపడింది. అప్పులు చేసి వేసిన పంటలు లోఓల్టేజీ కారణంగా ఎండి పోతున్నాయి. మండలంలో రబీ కింద రైతులు వేరుశనగ సాగు చేశారు. లోఓల్టేజీ కారణంగా పంటకు తడులివ్వలేకపోతున్నారు. దీంతో పంట వాడు ముఖం పడుతోంది. నాలుగు రోజులుగా విద్యుత్ సక్రమంగా లేకపోవడంతో పూర్తిగా పంటలు ఎండుదశకు చేరుకుంటున్నాయి. ముదిగుబ్బ విద్యుత్ సబ్ స్టేషన్ పరిధిలోని గుంజేపల్లి ఫీడర్ కింద ఉన్న గ్రామాలకు విద్యుత్ సరఫరా అరకొరగా అవడంతోపాటు లోఓల్టేజీ సమస్య నెలకొంది. దీంతో రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. గుంజేపల్లి, గుడ్డంపల్లి తండా, పొడరాళ్ళపల్లి, రామస్వామి తండా, పూజారి తండా, మంగళమడక, పాతూరు పరిధిలోని పలు గ్రామాల్లో లోఓల్టేజీ సమస్యతో పంటలు ఎండిపోతున్నాయని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. సాంకేతిక కారణాల సాకుతో వ్యవసాయానికి రోజుకు మూడు, నాలుగు గంటలే విద్యుత్ సరఫరా చేస్తున్నారని వారే వాపో తున్నారు. వేరుశనగ పంట చేతికొచ్చే సమయానికి ఎండలు తీవ్రంగా ఉంటాయనీ, ఇప్పుడే కరెంటు కష్టాలు ఉంటే.. అప్పుడెలా ఉంటుందోనని అన్నదాతలు ఆందోళన చెందుతున్నారు. ఈ క్రమంలో ఆయా గ్రామాలకు చెందిన రైతులు రెండు రోజుల క్రితం విద్యుత్ సబ్‌స్టేషన్ ఎదుట రోడ్డుపై బైఠాయించి, ధర్నా చేపట్టారు. సక్రమంగా విద్యుత్ సరఫరా చేస్తామని అధి కారులు హామీ ఇచ్చినా.. పరిస్థితిలో మార్పు లేదని రైతులు వాపోతున్నారు. విద్యుత్ సబ్‌స్టేషన్‌లో ఆపరేటర్లు, కొన్ని గ్రామాలకు లైన్‌మెన్ల కొరత ఉన్నా సంబంధిత అధికారులు పట్టించుకోవడం లేదని రైతులు పేర్కొన్నారు. ఇప్ప టికే సమస్యను పరిష్కరించాలని రైతులు కోరుతున్నారు.

పంటలు దెబ్బతింటున్నాయి



ఖరీఫ్‌లో వేరుశనగ పంట పూర్తిగా దెబ్బ తిని నష్టపోయా. రబీలోనైనా పంట పెట్టి అప్పులు తీర్చుకుందామనుకున్నా. విద్యుత్ సమస్యతో మళ్లీ నష్టపోతున్నా. పంట చేతికి రాకపోతే ఏం చేయాలో దిక్కుతోచడం లేదు.

- భజనూనాయక్, రైతు పూజారి తండా

విద్యుత్ సమస్య పరిష్కరించాలి



అధిక వర్షాలతో ఖరీఫ్‌లో సాగు చేసిన వేరుశనగ పంట పూర్తిగా నష్టపోయా. అప్పులు చేసి రబీలో ఐదెకరాల్లో వేరుశనగ సాగు చేశా. విద్యుత్ సమస్యతో పంట ఎండిపోతోంది. అధికారులు వెంటనే సమ స్యను పరిష్కరించి, పంటలను కాపాడాలి.


- శివలీబాయి, మహిళారైతు, రామస్వామితండా

మూడు రోజుల్లో పరిష్కరిస్తాం

లోఓల్టేజీ సమస్యను మూడురోజుల్లో పరిష్కరిస్తాం. రాళ్ళఅ నంతపురం, మారాల సబ్ స్టేషన్ల నుంచి పొలాలకు ప్రత్యామ్నా యంగా విద్యుత్ సరఫరా చేస్తాం.

- బాలసుబ్రహ్మణ్యం, ఏడీ, కదిరి

దాడుల ఫార్ములా..!



- కొత్త నేత సొంత పంథా
- మాట వినని నేతపై పన్నుల శాఖతో దాడులు
- మీడియాపైనా దాడులకు సన్నద్ధం
- ప్రైవేటు సైనికుల్లా గన్‌మెన్





పెనుకొండపై దుర్గం ప్రయోగం

ఆ ప్రజాప్రతినిధి వచ్చిన కొన్ని రోజులకే తన మార్కు రాజకీయాన్ని పెనుకొండపై ప్రయోగించేందుకు అడుగులు వేస్తున్నట్లు తెలుస్తోంది. ఇటీవలి పరిణామాలను పరిశీలిస్తే కళ్యాణదుర్గం ఫార్మూలా ఇక్కడ కూడా ప్రయోగిస్తున్నట్లు ఆ పార్టీ వర్గాలే చర్చించుకుంటుండడం గమనార్హం. పెనుకొండ ఎమ్మెల్యే శంకర్‌నారాయణను వైసీపీ బదిలీల్లో భాగంగా అనంతపురం పార్లమెంటు నియోజకవర్గ ఇన్‌చార్జిగా నియమించింది. కళ్యాణదుర్గం నుంచి ప్రాతినిధ్యం వహిస్తున్న మంత్రి ఉష శ్రీచరణ్‌ను పెనుకొండ ఇన్‌చార్జిగా పంపారు. ఆమె అక్కడి రాజకీయాన్నే ఇక్కడ కూడా చలాయించేందుకు సిద్ధం అవుతున్నట్లు తెలుస్తోంది.

హిందూపురం

● దుర్గం ఫార్ములా..

కళ్యాణదుర్గంలో 2019లో ఎమ్మెల్యేగా గెలిచిన కొన్నిరోజులపాటు ఉష శ్రీచరణ్ మామూలుగానే వ్యవహరించారు. తరువాత తన మార్క్ రాజకీయాలు ప్రయోగిస్తూ వచ్చారు. ఆమె తీరును సొంత పార్టీల నాయకులే వ్యతిరేకిస్తూ వచ్చారు. తన మాట వినే సొంత పార్టీ నేత లపైనే కేసులు బనాయించి, ఇబ్బందులు పెట్టినట్లు అక్కడి నాయ కులు కథలు కథలుగా చెప్పుకుంటారు. ఆమెను ఎవరైనా వ్యతిరేకిస్తే వారి బలం, బలహీనతలను తెలుసుకోవడంలో ఆమె దిట్ట అని కళ్యాణదుర్గం నాయకులు ఇప్పటికీ చెప్పుకుంటుంటారు. ఆమెను వ్యతిరేకించిన వారు దారికి రాకపోతే ఆర్థికంగా దెబ్బతీయడం, వారి బలహీనతలను ఆసరాగా తీసుకుని ప్రయోగాలు చేశారు. సొంత సామాజికవర్గానికి చెందిన నాయకులపైనే కేసులు పెట్టించిన ఘనత సదరు ప్రజాప్రతినిధికే దక్కుతుందన్న చర్చ ఆ పార్టీలో సాగుతోంది. ఎన్నికల సమయంలో ఇచ్చిన మొత్తాన్ని ఖర్చు చేయలేదనీ, వాపసు ఇవ్వాలని ఓ నాయకుడిని అడిగారని బహిరంగంగానే చెప్పుకుంటున్నారు. ఆయన ఇవ్వనందుకు కేసు పెట్టించి, వసూలు చేసినట్లు సమాచారం. మాట వినని నేతపై వాణిజ్య పన్నుల శాఖాధికారులతో చేయిస్తున్నట్లు సమాచారం. పెనుకొండకు మంత్రి వచ్చాక గోరంట్ల మండలాన్ని ఆమె భర్త చరణ్‌రెడ్డికి అప్పగించారు. ఆయన అక్కడే ఉండి పార్టీ వ్యవహారాలు చూస్తున్నారు. ఈ మండలంలో అధికార పార్టీకి చెందిన బలమైన సామాజికవర్గ నాయకులు.. ఎమ్మెల్యే శంక ర్‌నారాయణను వ్యతిరేకించారు. వారిని మచ్చిక చేసుకునేందుకు మంత్రి భర్త అదే సామాజికవర్గానికి చెందినవారు కావడంతో ఆ మండలంపైనే ఎక్కువ ఫోకస్ పెట్టినట్లు తెలిసింది. ఈ మండలంలో ఆదాయ వనరులు పుష్కలంగా ఉన్నాయి. ఈ పరిస్థితుల్లో సదరు మండలంపైనే అత్యధికంగా సమయం కేటాయిస్తున్నారు. గోరంట్లలో ఓ నాయకుడు గతంలో అధికార పార్టీలో ఉండేవారు. ప్రస్తుతం తట స్థంగా ఉంటున్నారు. ఆయనను ఎలాగైనా తమవర్గంలోకి రప్పించు కునేందుకు ఆ మండలంలోని నాయకులు ప్రయత్నించారు. రాష్ట్రంలో మారుతున్న రాజకీయ పరిస్థితులను గమనించి తటస్థంగా ఉండ టమే నయమని ఆయన అనుకున్నారు. ఆయన ఆర్థికంగా బలమైన వారు కావడంతో ఎలాగైనా దారికి తెచ్చుకోవాలని ప్లాన్ వేసినట్లు తెలుస్తోంది. ఆయనతో ఒకట్రెండు సార్లు చర్చించారు. అయినా ఆయన ససేమిరా అనడంతో ఆరు రోజుల క్రితం అనంతపురానికి చెందిన వాణిజ్య పన్నుల శాఖాధికారులను రప్పించి ఆ నాయకుడి ఇల్లు, షాపింగ్ కాంప్లెక్స్‌లో దాడులు చేయించారు. ఉదయం నుంచి సాయంత్రం వరకు సోదాలు కొనసాగాయి. అక్రమాలు బయటప డకపోవడంతో అధికారులు వట్టి చేతులతో వెళ్లిపోయినట్లు తెలిసింది. ఆ తరువాత సదరు నాయకుడు తన సన్నిహితుల వద్ద దాడుల విషయాన్ని తెలిపి, ఆవేదన వ్యక్తం చేసినట్లు సమాచారం. ఆ నాయకుడు మైనార్టీ వర్గానికి చెందినవారు కావడంతో అధికార పార్టీ నాయకులు కూడా బయటకు పొక్కకుండా జాగ్రత్త పడ్డారు. ఇదే ఫార్ములా చేనేతలు అధికంగా ఉన్న ప్రాంతంలో కొంతమందిపై ప్రయోగించేందుకు సిద్ధం అవుతున్నట్లు సమాచారం. అక్కడ కొందరిని దారికి తెచ్చుకునేం దుకు, మరికొందరిని ఆర్థికపరమైన అంశాల కోసం ప్రయోగాలకు సిద్ధం అవు తున్నట్లు సమాచారం.




● మీడియాపై సైతం..



కళ్యాణదుర్గంలో సదరు ప్రజాప్రతినిధి వ్యవహారాలను అక్కడి మీడియా ప్రతినిధులు వెలికి తీసేందుకు ప్రయ త్నించగా.. పలువిధాలుగా వారిపై దాడులు చేయించా రన్న ఆరోపణలు బహిరంగంగానే వినిపిస్తున్నాయి. ప్రజా ప్రతినిధికి వ్యతిరేకంగా ఎవరైనా కథనాలు రాస్తే తన చుట్టూ ఉన్న సైన్యం ద్వారా బెదిరించడం లేదంటే కేసులు పెట్టిస్తామని ఫోన్‌లో చెప్పించడం, అదీకాక ఆర్థికపరమైన అంశాలను ప్రస్తావించి వాటిని సోషల్ మీడియాలో పెట్టడం, వారి బలంబలహీనతలను బేరీజు వేయడం చేసేవారని అక్కడి మీడియా ప్రతినిధులు.. మంత్రిపై కోకొ ల్లలుగా చెప్పుకుంటుంటారు. అదే ఫార్ములాను ఎన్నికలు సమీపిస్తున్న తరుణంలో వారుచేసే ఆగడాలను బయట ప్రపంచానికి తెలియజేయనీయకూడదంటూ ఇక్కడ కూడా మీడియాపై దాడులకు సిద్ధమయ్యారనేందుకు శని వారం ఘటనే నిదర్శనం. సోమందేపల్లి మండలంలో మంత్రికి వ్యతిరేకంగా నినాదాలు చేసి, ఫ్లెక్సీలు చించి వేస్తున్న దృశ్యాలను చిత్రీకరిస్తున్న ఏబీఎన్ ప్రతినిధిపై మంత్రి గన్‌మెన్ అత్యుత్సాహం ప్రదర్శించారు. సెల్‌ఫోన్ లాక్కున్నారు. మొదటి నుంచి మంత్రి వద్దే ఉన్న గన్‌మెన్ ప్రైవేటు సైన్యంలా వ్యవ హరిస్తుంటారని పోలీసు వర్గాలే పేర్కొంటుండడం గమనార్హం. ఏది ఏమైనా కళ్యాణదుర్గం ఫార్మూలా పెనుకొండలో ప్రయోగించేందుకు సిద్ధం అవుతున్నట్లు స్పష్టమవుతోంది. రాజకీయపరంగా అక్కడికి, ఇక్కడికి చాలా వ్యత్యాసం ఉంటుంది. ఈ పరిస్థితుల్లో ఎన్నికల వేళ సదరు ప్రజాప్ర తినిధి ఎలా వ్యవహరిస్తారో వేచిచూడాల్సిందే. కళ్యాణ దుర్గం రాజకీయం ఆ ఫార్మూలాను ఇక్కడి ప్రజలు విశ్వ సించరన్న వాదనలు వినిపిస్తున్నాయి.

తహసీల్దార్లకు పోస్టింగ్



పుట్టపర్తిరూరల్, ఫిబ్రవరి 4: సార్వత్రిక ఎన్నికల నేప థ్యంలో జిల్లాకు బదిలీపై వచ్చిన తహసీల్దార్లకు ఆయా స్థానాలను కేటాయించారు. ఈ మేరకు జిల్లా కలెక్టర్ అరుణ్‌బాబు ఆదివారం ఉత్తర్వులు జారీ చేశారు.

తహసీల్దార్ పేరు	స్థానం
హమీద్‌బాషా	చెన్నేకొత్తపల్లి
వెంకటేశ్వర్లు	మడకశిర
ప్రతాప్‌రెడ్డి	గుడిబండ
బద్రుజామ	రొళ్ల
వెంకటసుబ్బయ్య	అమరాపురం
శివప్రసాద్‌రెడ్డి	హిందూపురం
భాగ్యలత	చిలమత్తూరు
ఉదయశంకర్‌రాజు	పెనుకొండ
వసుంధర	పరిగి
లక్ష్మీనారాయణ	రొద్దం
అంజనాదేవి	సోమందేపల్లి
అక్బల్‌బాషా	గోరంట్ల
వేణుగోపాల్	పుట్టపర్తి
కళావతి	కొత్తచెరువు
భారతి	కలెక్టరేట్
నాగభూషణం	నల్లమాడ
ఖాజాబీ	ఓబుళదేవరచెరువు
రమేష్	ధర్మవరం
నజ్మాబాను	తాడిమర్రి
సరస్వతి	ముదిగుబ్బ
శివశంకర్‌నాయక్	బత్తలపల్లి
రామనాథరెడ్డి	కదిరి
రామకుమారి	తలుపుల
శ్రావణి	కలెక్టరేట్
శ్రీనివాసులు	కలెక్టరేట్
వెంకటస్వామి	ఆర్డీఓ ఆఫీసు, పుట్టపర్తి
రామాంజనేయరెడ్డి	కలెక్టరేట్
అన్వర్ హుస్సేన్	కలెక్టరేట్
బాబు	ఆర్డీఓ ఆఫీసు, కదిరి
రమేష్‌బాబు	ఆర్డీఓ ఆఫీసు, ధర్మవరం
బాలనరసింహులు	లేపాక్షి



చెన్నేకొత్తపల్లిలో నిర్వహించిన ర్యాలీలో పాల్గొన్న పరిటాల సునీత



సిండికేట్‌నగర్‌లో మాట్లాడుతున్న మాజీ మంత్రి

టీడీపీతోనే బీసీల అభివృద్ధి

జయహో బీసీ సదస్సులో మాజీ మంత్రి పరిటాల సునీత

చెన్నేకొత్తపల్లి/అనంతపురం రూరల్, ఫిబ్రవరి 4: టీడీపీతోనే బీసీల అభివృద్ధి సాధ్యమని మాజీమంత్రి పరిటాల సునీత పేర్కొన్నారు. బీసీలకు రాజకీయ ప్రాధాన్యత కల్పించిన ఘనత స్వర్గీయ ఎన్టీఆర్, మాజీ ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడుకే దక్కుతుందన్నారు. నగరంలోని సిండికేట్‌నగర్, చెన్నేకొత్తపల్లిలో ఆదివారం నిర్వహించిన జయహో బీసీ సదస్సుల్లో మాజీమంత్రి పాల్గొన్నారు. ఆయా సమావేశాల్లో పరిటాల సునీత మాట్లాడుతూ బీసీల సంక్షేమం కోసం చంద్రబాబు నాయుడు అనేక సంక్షేమపథకాలు అమలు చేశారన్నారు. వైసీపీ పాలనలో బీసీలకు తీవ్ర అన్యాయం జరుగుతోందన్నారు. రాప్తాడు నియోజకవర్గంలో ఎమ్మెల్యే తోపుదుర్తిప్రకాశ్‌రెడ్డి, ఆయన సోదరులు బీసీలు, ఎస్టీలకు చెందిన భూములను లాక్కోవడం, ప్రశ్నించిన వారిపై కేసులు పెట్టి ఇబ్బందులకు గురిచేయడం జరుగుతోందన్నారు. స్థానికంగా ఓ వైసీపీ నాయకుడి డాబాను కేంద్రంగా చేసుకుని మట్టి, ఇసుక, భూ కబ్జాలకు తోపుదుర్తి సోదరులు పాల్పడుతున్నారని ఆరోపించారు. బీసీలంతా ఐకమత్యంగా టీడీపీ విజయానికి కృషిచేయాలని సూచించారు. రాప్తాడు, ధర్మవరం నియోజకవర్గాలలో తాను, పరిటాల శ్రీరామ్ భారీ మెజారిటీతో విజయం సాధిస్తామన్న ధీమా వ్యక్తం చేశారు. సదస్సులో నియోజకవర్గ పరిశీలకుడు బత్తిని వెంకటరాముడు, బీసీసెల్ జిల్లా అధ్యక్షుడు కుంటిమద్ది రంగయ్య, కన్వీనర్ ముత్యాల్‌రెడ్డి, జిల్లా ఉపాధ్యక్షుడు దండు ఓబుళేశు, రామసుబ్బమ్మ, ఎజ్జే శంకర్, అంకే అమరేంద్ర, ముత్యాలప్ప, జనసేన క్రాంతి కుమార్, వరలక్ష్మి, బెస్త నాగార్జున, బండారు భార్గవ, భాస్కర్ పాల్గొన్నారు.

వైసీపీ నుంచి టీడీపీలోకి చేరిక

మండలంలోని హరియన్‌చెరువు, ఎర్రోనిపల్లికి చెందిన పది కుటుంబాలు వైసీపీ నుంచి టీడీపీలోకి చేరారు. జయహో బీసీ సదస్సులో మాజీమంత్రి పరిటాలసునీత సమక్షంలో టీడీపీ తీర్థం పుచ్చుకున్నారు. హరియన్‌చెరువుకు చెందిన కాటమయ్య, సుబ్బరాయుడు, రమేశ్, నాగేంద్ర, రంగనాయకులు, పోతన్న, ఎర్రోనిపల్లికి చెందిన గంగప్ప, ఎర్రప్ప, ఎగువతండాకు చెందిన సుధాకర్‌నాయక్ తదితరులకు పరిటాలసునీత పార్టీ కండువాలు వేసి ఆహ్వానించారు.


తుది జాబితాలోనూ తప్పులే..!

డబుల్ ఓట్లు యథాతథం..

మర్రిమాకులపల్లిలో 1360 ఓట్ల తొలగింపు...

ముంపునకు గురైందని బూత్‌ను సైతం తీసేసిన అధికారులు

తప్పు జరిగిందంటూ పేర్ల నమోదుకు అవకాశం



రెండు చోట్ల నమోదైన ఓటు

తాడిమర్రి, ఫిబ్రవరి 4: ఓటరు జాబితాలో తిరిగి అవే తప్పులు దొర్లాయి. మరణించిన వారి వివరాలు ప్రతి గ్రామంలో ఉన్నా వాటిని సవరించలేదు. పిన్నదరి గ్రామానికి చెందిన సాకే విజయ్‌కుమార్ రెండవ పోలింగ్ బూత్‌లో 789 సీరియల్ నెంబరులో ఉండగా మూడవ పోలింగ్ బూత్‌లో 755 సీరియల్ నెంబరుతో నమోదు చేశారు. రెండు చోట్ల ఒకే అడ్రసు ఉండగా కార్డు నెంబరు మాత్రం మారింది. సుధాకర్ పేరు కూడా సీరియల్ నెంబర్ 382లో ఒకసారి, 766లో మరొకసారి నమోదు చేశారు. సాకే చిన్నగంగన్న 512, 655 సీరియల్ నెంబర్‌లో కూడా చేశారు. ఇలా ప్రతి గ్రామంలో డబుల్ ఎంట్రీలు ఉన్నాయి. ఆత్మకూరు గ్రామానికి చెందిన పోలింగ్‌బూత్‌లో ఉన్న పేర్లు తాడిమర్రి పోలింగ్ బూత్‌లలో కూడా ఉండటం విశేషం. వీటికితోడు మండలంలోని మర్రిమాకుల పల్లి గ్రామంలో దాదాపు 1360 మంది ఓటర్లు ఉండగా గ్రామం ముంపునకు గురైందని చెప్పి పోలింగ్ బూత్‌ను తీసివేయడంతోపాటు ఓటరు జాబితా నుంచి ఆ గ్రామానికి చెందిన వారి పేర్లన్నీ పూర్తిగా తొలగించారు. తాజాగా పేర్లు నమోదు చేయించుకునేందుకు వారికి ఇప్పుడు అవకాశం కల్పించి నమోదు చేయించే ప్రయత్నం చేస్తున్నారు.




డోర్ నంబరు చోట పరిశ్రమగా నమోదు చేసిన అధికారులు

ఇంటి నంబరుగా పరిశ్రమ

శింగనమల: మండలంలోని లోలూరు గ్రామ ఓటరు జాబితాలో ఇంటి నంబరును పరిశ్రమగా నమోదు చేశారు. ఇంటి నంబరు వద్ద పరిశ్రమ నో 1 అంటూ 50 మందిని ఓటర్లుగా నమోదు చేశారు. పోలింగ్ బూత్ 79లో ఇంటి నెంబర్లను తప్పుగా వేశారు. ఇదే బూత్‌లో టై1, టై2 అని ఇంగ్లీష్ అక్షరాలతో నమోదు చేసి ఓటరుకు ఇంటి నంబరుగా కేటాయించారు.



లక్ష్మీదేవి బతికున్నా చనిపోయినట్లు చూపించి డిలీట్ చేసిన దృశ్యం



చనిపోయినా ఓటరు జాబితాలో బతికున్నట్లు ఉన్న దృశ్యం

బతికున్నా చంపేశారు...

పెనుకొండ రూరల్: బతికున్నవారు చనిపోయినట్లు, చనిపోయినవారు బతికున్నట్లు ఓటరు జాబితాలో నమోదైంది. ఓటరు జాబితాలో తప్పులు దొర్లాయని రాజకీయ పార్టీల నాయకులు బీఎల్‌ఎలకు, ఎన్నికల నిర్వహణాధికారులకు ఫిర్యాదు చేసినా సవరించిన జాబితాలో అవే తప్పులు చోటుచేసుకున్నాయి. మండలంలోని శెట్టిపల్లిలో 93, 94 పోలింగ్ బూత్‌లలో వరుస సంఖ్య 295 జీ కాంతమ్మ మూడేళ్ల క్రితం చనిపోయింది. ఆమెను తొలగించే క్రమంలో వరుస సంఖ్య 299 లక్ష్మీదేవి చనిపోయినట్లు ఓటరులిస్ట్‌లో నమోదైంది. అదేవిధంగా వరుస సంఖ్య 323 ఫక్రుద్దీన్ చనిపోయారు. ఓటరు జాబితా లిస్ట్‌లో తొలగించలేదు.

మెగా డీఎస్సీ అడిగితే... అక్రమ కేసులు పెడతారా..?

తెలుగుయువత, టీఎన్ఎస్ఎఫ్ నాయకుల మండిపాటు

అనంతపురం విద్య, ఫిబ్రవరి 4: నిరుద్యోగులు మెగా డీఎస్సీ ఇవ్వాలంటూ డిమాండ్ చేస్తూ నిరసన తెలిపితే వారిపై అక్రమంగా కేసులు పెట్టడం దుర్మార్గమని వెంటనే ఆ కేసులు ఎత్తివేయాలని తెలుగు యువత, టీఎన్ఎస్ఎఫ్ నాయకులు డిమాండ్ చేశారు. ఆదివారం టీడీపీ కార్యాలయంలో విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా తెలుగు యువత రాష్ట్ర ఉపాధ్యక్షుడు వెంకటప్ప, టీఎన్ఎస్ఎఫ్ రాష్ట్ర నాయకులు లక్ష్మీనరసింహ, జిల్లా అధ్యక్షుడు ధనుంజయనాయుడు మాట్లాడుతూ రెండు రోజుల క్రితం నిరుద్యోగులు వైసీపీ ప్రభుత్వం కేబినెట్‌లో 6100 డీఎస్సీ పోస్టులకు ఆమోదం తెలపడాన్ని తీవ్రంగా వ్యతిరేకించారన్నారు. నగరంలో నిరుద్యోగులంతా శాంతియుతంగా ర్యాలీ చేస్తూ కలెక్టరేట్‌కు వెళ్లి నిరసన తెలిపారన్నారు. న్యాయమైన డిమాండ్ల కోసం నిరసన తెలిపిన నిరుద్యోగులు, నాయకులపై అక్రమంగా ఈ ప్రభుత్వం పోలీసులతో కేసులు పెట్టించడం దారుణం అన్నారు. జగన్ ప్రభుత్వం ఆఖరికి నిరుద్యోగులపై కూడా అక్రమ కేసులు బనాయిస్తోందన్నారు. ఇది నిరుద్యోగుల పాలిట దగా డీఎస్సీనేనని, మరొకటి కాదన్నారు. ఉమ్మడి అనంతపురం జిల్లావ్యాప్తంగా సుమారు 40 వేల మందికిపైగా నిరుద్యోగులు డీఎస్సీ నోటిఫికేషన్ కోసం ఎదురుచూస్తున్నారన్నారు. మరీ తక్కువగా 4 ఎస్‌జీటీ పోస్టులు ఇవ్వాలని చూస్తుండటం అన్యాయం అన్నారు. వెంటనే 28 వేల డీఎస్సీ పోస్టులు భర్తీ చేయాలని, లేకుంటే జగన్ పర్యటనను అడ్డుకుంటామని హెచ్చరించారు. కార్యక్రమంలో ఆయా సంఘాల నాయకులు నరేశ్, వీరనంద, శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.



ప్లకార్డులు చూపుతూ మాట్లాడుతున్న నాయకులు

సర్వర్ డౌన్.. ఇబ్బందిపడ్డ లబ్ధిదారులు



పురంలో సర్వర్ సమస్యతో కుస్తీ పడుతున్న సిబ్బంది



హిందూపురంలో రిజిస్ట్రేషన్ కోసం వచ్చిన లబ్ధిదారులు

సర్వర్ సమస్యతో లబ్ధిదారులు ఇబ్బందులు పడ్డారు. జగనన్న ఇంటి పట్టాలకు సంబంధించి రిజిస్ట్రేషన్ ప్రక్రియను ప్రభుత్వం ప్రారంభించింది. దీంతో ఉదయం నుంచి రిజిస్ట్రేషన్ కార్యాలయాల వద్ద లబ్ధిదారులు పడిగాపులుకాచారు. అయితే సర్వస్ సమస్య తలెత్తడంతో సాయంత్రం వరకు లబ్ధిదారులు రిజిస్ట్రేషన్ కోసం వేచిచూడాల్సిన పరిస్థితి నెలకొంది.

ముందుకుసాగని జగనన్న ఇంటిపట్టాల రిజిస్ట్రేషన్

హిందూపురం అర్బన్, ఫిబ్రవరి 4: ప్రభుత్వం ప్రవేశపెట్టిన నవరత్నాల్లో భాగంగా పేదలకు ఇల్లు కార్యక్రమాన్ని వేగవంతం చేశారు. సచివాలయ సెక్రటరీలతో రిజిస్ట్రేషన్ చేయించే కార్యక్రమానికి శ్రీకారం చుట్టారు. ఆదివారం సైతం పనిచేయాల్సిందిగా వారికి ప్రభుత్వం నుంచి ఆదేశాలు వచ్చాయి. దీంతో ఆదివారం వారు రిజిస్ట్రేషన్ ప్రక్రియను చేపట్టారు. లేపాక్షి మండలానికి సంబంధించి లేపాక్షిలో రిజిస్ట్రేషన్ కార్యక్రమాన్ని చేపట్టారు. అయితే సర్వర్, నెట్‌వర్క్ సమస్య తలెత్తడంతో చేసేదిలేక హిందూపురం సబ్ రిజిస్ట్రార్ కార్యాలయానికి రావాల్సివచ్చింది. లేపాక్షి నుంచి పెద్దసంఖ్యలో లబ్ధిదారులు తరలివచ్చారు. దీంతో సచివాలయ సెక్రటరీలే కాకుండా హిందూపురం సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయ సిబ్బంది కూడా విధులు నిర్వర్తించాల్సిన పరిస్థితి నెలకొంది. ఆదివారం కూడా తమకు ఏంటి ఈ పరిస్థితి అని వారు అనుకోవడం కనిపించింది. హిందూపురం మండల పరిధిలో 5500 ఇళ్లకు సంబంధించి రిజిస్ట్రేషన్ కావాల్సివుంది. అయితే సెక్రటరీలకు అవగాహన లేకపోవడం, సర్వర్ సమస్యతో ఆదివారం కేవలం 70 వరకు రిజిస్ట్రేషన్ జరిగినట్లు సమాచారం.

శింగనమల: పేదల ఇళ్లపట్టాలకు సంబంధించి ప్రభుత్వం రిజిస్ట్రేషన్ ప్రక్రియకు శ్రీకారం చుట్టింది. శింగనమల నియోజకవర్గానికి సంబంధించి ఆదివారం రిజిస్ట్రేషన్ ప్రక్రియను 90 శాతం మేర పూర్తిచేయాలని ఉన్నతాధికారుల నుంచి ఆదేశాలు వచ్చాయి. ఈ నేపథ్యంలో జగనన్న కాలనీలో ఇల్ల పట్టాల రిజిస్ట్రేషన్‌కు భారీసంఖ్యలో లబ్ధిదారులు తరలివచ్చారు. శింగనమల, నార్పల, గార్లదిన్నె, బుక్కరాయసముద్రం నుంచి లబ్ధిదారులు శింగనమల రిజిస్ట్రార్ కార్యాలయానికి వచ్చారు. రిజిస్ట్రేషన్ ప్రక్రియ ప్రారంభించగానే సర్వర్ సమస్య తలెత్తింది. మధ్యాహ్నం 3 గంటలకు సర్వర్ పనిచేయడంతో 10మంది లబ్ధిదారులకు సంబంధించి మాత్రమే రిజిస్ట్రేషన్ చేశారు. దీంతో మిగతా లబ్ధిదారులు ఈ మాత్రానికి ఇంత ఆర్భాటమెందుకని అక్కడి నుంచి వెళ్లిపోవడం కనిపించింది.

జిల్లా కార్యవర్గం ఎంపిక



నూతన కార్యవర్గ సభ్యులు

అనంతపురం విద్య, ఫిబ్రవరి 4: జిల్లా మండల విద్యాశాఖాధికారులు-2 సంఘం కొత్త కార్యవర్గాన్ని ఎంపిక చేశారు. ఆదివారం ఉపాధ్యాయభవన్‌లో రాష్ట్ర స్టీరింగ్ కమిటీ సభ్యుడు రవిచంద్ర ఆధ్వర్యంలో కొత్త కార్యవర్గాన్ని ఎంపిక చేశారు. జిల్లా అధ్యక్షుడిగా భవానీ శంకర్, ప్రధానకార్యదర్శిగా నారపరెడ్డి, గౌరవాధ్యక్షుడిగా లింగా నాయక్, కోశాధికారిగా తిప్పేస్వామి, అసోసియేట్ అధ్యక్షుడిగా వెంకట రమేష్, అదనపు ప్రధానకార్యదర్శిగా సరితారాణి, కార్యవర్గ సభ్యులుగా ధనలక్ష్మి, తిమ్మప్ప, బాబు, శివప్రసాద్, మల్లికార్జున, సనావర్ బాషా, రాష్ట్ర ప్రతినిధులుగా రామచంద్ర, మదన్ మోహన్‌ను ఎంపిక చేశారు. కార్యక్రమంలో ఎంఈఓ-2లు గురుప్రసాద్, హరికృష్ణ, ఓబుళపతి, మల్లికార్జున, మనోహర్, సుబ్బరాయుడు, కుళ్లాయప్ప, రామగోవిందరెడ్డి, పరమేశ్వర్‌రెడ్డి పాల్గొన్నారు.

పోరాటాల యోధుడు వడ్డె ఓబన్న



వడ్డె ఓబన్న విగ్రహ ఆవిష్కరణలో పాల్గొన్న నాయకులు

హిందూపురం అర్బన్, ఫిబ్రవరి 4: పోరాటాల యోధుడు వడ్డె ఓబన్న అని వడ్డెర్ల సంఘం నాయకులు కొనియాడారు. ఆదివారం పట్టణంలోని శ్రీకంఠపురం సర్కిల్‌లో వడ్డె ఓబన్న విగ్రహావిష్కరణ ఘనంగా నిర్వహించారు. ఆ సంఘం నాయకులు మాట్లాడుతూ బ్రిటిష్ వారు భారతీయులను బానిసలుగా చూస్తున్న సమయంలో ఉయ్యాలవాడ నరసింహారెడ్డితో కలిసి పోరాటాలు చేసిన యోధుడు ఓబన్న అని అన్నారు. రేనాటి ప్రాంత ప్రజల గుండెల్లో నిలిచిపోయిన గొప్ప నాయకుడన్నారు. ఐక్యతతో వడ్డెర్లు ఆర్థికంగా, రాజకీయంగా, సామాజికంగా ఎదగాలన్నారు. అంతకుముందు యువత బైక్‌ర్యాలీ నిర్వహించారు. ఓబన్న విగ్రహానికి పూలమాలలు వేసి, నివాళులు అర్పించారు. కార్యక్రమంలో వడ్డె ఓబన్న 6వ తరం మనవడు బాలనరసింహులు, కర్ణాటక మాజీ మంత్రి వెంకటరమణప్ప, కర్ణాటక బెంగళూరు ఓబీసీ సంఘవ హనుమంతరాయప్ప, డీఎస్పీ వేణుగోపాల్, ఆ సంఘం నాయకులు రంగప్ప, ప్రసాద్, నాగరాజు, వెంకటేష్, కొల్లకుంట అంజినప్ప, దేవర్ల మురళి, మల్లెల జయరాం, ఓబీసీ అధ్యక్షుడు వెంకటేశులు, దుర్గా నవీన్, 9వ వార్డు కౌన్సిలర్ మంజుల హాజరయ్యారు.

కారు, ద్విచక్రవాహనం ఢీ

ఇద్దరు మృతి... ఇరువురికి గాయాలు



రాజు మృతదేహం

ఉరవకొండ, ఫిబ్రవరి 4: మండలంలోని బూదగవి సమీపంలో ఆదివారం జరిగిన రోడ్డు ప్రమాదంలో రామాంజనేయులు(47), రాజు(27) మృతి చెందగా మరో ఇద్దరికి గాయాలయ్యాయి. విడపనకల్లుకు చెందిన రామాంజినేయులు, రాజు బేల్దారి పని చేసుకుంటూ జీవనం సాగిస్తున్నారు. ఆదివారం పని నిమిత్తం రామాంజనేయులు, రాజుతో కలిసి ఉరవకొండకు వచ్చారు. పని ముగించుకుని ద్విచక్రవాహనంలో విడపనకల్లుకు వెళ్తుండగా, బళ్లారి నుంచి అనంతపురం వైపునకు వెళ్తున్న కారు, స్కూటర్‌ను ఢీకొంది. దీంతో ద్విచక్రవాహనంలో ఉన్న రామాంజనేయులు అక్కడికక్కడే మృతి చెందాడు. కారు పల్టీలు కొట్టి పొలంలో పడింది. ద్విచక్రవాహనం నుజ్జునుజ్జైంది. రాజుకు గాయాలు కావడంతో ఉరవకొండ ప్రభుత్వాసుపత్రికి తరలించారు. పరిస్థితి విషమంగా ఉండడంతో మెరుగైన వైద్యం కోసం అనంతపురానికి తరలిస్తుండగా మార్గమధ్యలో రాజు మృతి చెందాడు. కారులో ప్రయాణిస్తున్న బళ్లారికి చెందిన అభిషేక్, శుక్లా గాయపడ్డారు. మృతదేహాలను చూసి కుటుంబసభ్యులు కన్నీరుమున్నీరయ్యారు. పోలీసులు కేసు నమోదు చేశారు.



దెబ్బతిన్న ద్విచక్రవాహనం



రోదిస్తున్న రామాంజనేయులు కుటుంబసభ్యులు

7న కలెక్టరేట్ వద్ద ధర్నా

సీపీఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు రాంభూపాల్

అనంతపురం కల్చరల్, ఫిబ్రవరి 4: పంటనష్ట పరిహారం కోరుతూ ఈనెల 7న కలెక్టరేట్ వద్ద ధర్నా చేపట్టనున్నట్లు సీపీఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు రాంభూపాల్ ఆదివారం ప్రకటనలో తెలిపారు. వర్షాభావంతో జిల్లాలో ఐదులక్షల ఎకరాల్లో పంటలకు నష్టం వాటిల్లిందన్నారు. జరిగిన నష్టంలో పావు వంతు కూడా పరిహారం ప్రకటించలేదన్నారు. జిల్లా రైతులకు రాష్ట్ర ప్రభుత్వం 251 కోట్లు పరిహారం ప్రకటించి నాలుగు నెలలు గడుస్తున్నా ఇప్పటివరకూ ఒక్క రూపాయి కూడా రైతుల ఖాతాల్లో జమ కాలేదని విమర్శించారు. సంక్రాంతి పండుగ నాటికి రైతుల ఖాతాలకు జమ చేస్తామని ముఖ్యమంత్రి ప్రకటించినా అమలు చేయలేదన్నారు. బటన్ నొక్కి లెక్కలు చెబుతున్న ముఖ్యమంత్రికి ప్రకటించిన పంట నష్టపరిహారం నిధులు విడుదల చేసే విషయం గుర్తులేదా..? అని ప్రశ్నించారు. ఎన్నికల ప్రకటన వస్తే ప్రకటించిన పరిహారం కూడా అందదని రైతులు ఆందోళన చెందుతున్నారన్నారు. పంటనష్ట పరిహారం వెంటనే రైతుల ఖాతాలకు జమ చేయాలని డిమాండ్ చేస్తూ ఈనెల 7న కలెక్టరేట్ వద్ద చేపట్టే ధర్నాలో రైతులు, కూలీలు, కౌలురైతులు పెద్దసంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.

అనంతకు నాలుగు డీఎస్సీ పోస్టులా..!

మెగా డీఎస్సీ కోసం జిల్లాలో వేలాదిమంది నిరుద్యోగులు ఎదురుచూస్తుంటే కేవలం నాలుగు పోస్టులు మాత్రమే కేటాయించడం తగదని రాంభూపాల్ ప్రకటనలో పేర్కొన్నారు. 23వేలకుపైగా డీఎస్సీ పోస్టులు ప్రకటించాల్సి ఉండగా... నాలుగేళ్ల నిరీక్షణ తర్వాత రాష్ట్ర ప్రభుత్వం 6వేల పోస్టులు మాత్రమే ప్రకటించడం, అందులోనూ నాలుగు వేల పోస్టులకే క్లియరెన్స్ ఇవ్వడం దారుణమన్నారు. కలెక్టరేట్ వద్ద నిర్వహించిన డీవైఎఫ్ఐ ఆందోళనలో నిరుద్యోగులపై పెట్టిన కేసులను ఉపసంహరించుకోవాలని విజ్ఞప్తి చేశారు.

మీడియాపై దౌర్జన్యం సరికాదు

టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి సవిత

పెనుకొండ టౌన్, ఫిబ్రవరి 4: మంత్రి ఉషశ్రీ చరణ్.. మీడియాపై దౌర్జన్యం చేయడం సరికాదని టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి సవిత ఆదివారం అన్నారు. శనివారం సోమందేపల్లి మండలం చాలకూరు గ్రామంలో అధికార పార్టీ నాయకుల నుంచి మంత్రికి నిరసన సెగ తగిలింది. ఈ క్రమంలో వీడియో తీస్తున్న మీడియా ప్రతినిధిపై గన్‌మన్‌ను ఉసిగొలపడం దారుణమన్నారు. ప్రజాస్వామ్యంలో మీడియా ప్రతినిధులపై దాడులు చేయడం సరికాదన్నారు. ఇప్పటికైనా అధికార పార్టీ నాయకులు ఇలాంటి దాడులు మానుకోవాలని, ఎస్పీ స్పందించి గన్‌మన్‌పై చర్యలు తీసుకోవాలన్నారు.

'మంత్రిని బర్తరఫ్ చేయాలి'

పెనుకొండ టౌన్: మీడియా ప్రతినిధులపై గన్‌మెన్‌ను ఉసిగొలిపిన మంత్రి ఉషశ్రీచరణ్‌ను బర్తరఫ్ చేయాలని జైభీమ్‌భారత్‌పార్టీ జిల్లా కోకన్వీనర్ ఊటకూరు నాగరాజు డిమాండ్ చేశారు. ఆదివారం స్థానిక ఆర్‌అండ్‌బీ అతిథిగృహంలో ఆయన మాట్లాడుతూ.. ఆత్మీయ పలకరింపు సందర్భంగా తలెత్తిన పరిణామాలను చిత్రీకరిస్తున్న మీడియా ప్రతినిధులు సెల్‌ఫోన్ లాక్కుని, గన్‌మెన్ వీడియోలు డిలీట్ చేయించడం తగదన్నారు. దీనిని తీవ్రంగా ఖండిస్తున్నామన్నారు. కార్యక్రమంలో ఎంఎస్ఎఫ్, దళిత సంఘం నాయకులు పాల్గొన్నారు.

వ్యక్తి దారుణహత్య

ధర్మవరం, ఫిబ్రవరి 4: పట్టణంలోని ఇందిరమ్మకాలనీలో వ్యక్తి దారుణహత్యకు గురైనట్లు టూటౌన్ సీఐ అశోక్‌కుమార్ తెలిపారు. ఇందుకు సంబంధించిన వివరాలను సీఐ ఆదివారం వెల్లడించారు. ఇందిరమ్మకాలనీకి చెందిన బొగ్గుప్రతాప్(35) కూలి పనులు చేసుకుంటూ జీవించేవాడు. బొగ్గు ప్రతాప్, కేతిరెడ్డికాలనీకి చెందిన స్నేహలత ఇంటర్ చదివే సమయంలో ప్రేమించుకున్నారు. వీరి వివాహానికి కుటుంబసభ్యులు ఒప్పుకోలేదు. దీంతో బొగ్గుప్రతాప్, స్నేహలత వారివారి తల్లిదండ్రులు నిశ్చయించిన వివాహాలు చేసుకున్నారు. కొంత కాలం క్రితం బొగ్గు ప్రతాప్ భార్య మృతిచెందింది. దీంతో అతడు మళ్లీ కేతిరెడ్డికాలనీలో ఉన్న స్నేహలత ఇంటికి వెళ్లేవాడు. గమనించిన స్నేహలత కుటుంబసభ్యులు ఆమెను మందలించారు. ఈ క్రమంలో ఆదివారం ప్రతాప్ అతిగా మద్యం సేవించి, స్నేహలత ఇంటికి భర్తలేని సమయంలో వెళ్లి ఆమెను పట్టుకోవడానికి ప్రయత్నించాడు. ఆమె ఇంటిలో ఉన్న రోకలిబండతో తలపై బాది, అక్కడి నుంచి పరారైంది. రక్తస్రావంతో ప్రతాప్ కింద పడిపోగా.. స్థానికులు టూటౌన్ పోలీసులకు సమాచారం అందించారు. పోలీసులు అతడిని స్థానిక ప్రభుత్వాస్పత్రికి తరలించారు. ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మృతిచెందాడు. స్నేహలతను పోలీసులు అదుపులోకి తీసుకున్నట్లు తెలిసింది.

వైసీపీకి భారీ షాక్

● ధర్మవరంలో పార్టీని వీడిన వంద కుటుంబాలు ●పరిటాల శ్రీరామ్ సమక్షంలో టీడీపీలో చేరిక



పరిటాల శ్రీరామ్ సమక్షంలో టీడీపీలోకి చేరుతున్న వైసీపీనాయకులు

ధర్మవరం, ఫిబ్రవరి 4: ధర్మవరం నియోజకవర్గంలో రోజురోజుకూ వైసీపీకి షాక్ తగులుతోంది. భారీఎత్తున నాయకులు, కార్యకర్తలు ఆ పార్టీని వీడి తెలుగుదేశంలోకి చేరుతున్నారు. ఈ క్రమంలో ఆదివారం పట్టణంలోని టీడీపీ కార్యాలయంలో నియోజకవర్గ ఇన్‌చార్జి పరిటాల శ్రీరామ్ సమక్షంలో స్థానిక 27, 30 ,34వ వార్డులకు చెందిన సుమా రు వంద కుటుంబాల వారు వైసీపీని వీడి టీడీపీ తీర్థం పుచ్చుకున్నారు. వీరికి పరిటాల శ్రీరామ్ కండువాలు వేసి పార్టీలోకి సాదరంగా ఆహ్వానించారు. ఈ సందర్భంగా పా ర్టీలోకి చేరిన వారు మాట్లాడుతూ.. వైసీపీ ఆవిర్భావం నుం చి ఆ పార్టీలో ఉన్నామని, 2019 ఎన్నికల్లో ఆ పార్టీ గెలుపునకు ఎంతో కష్టపడ్డామని, అయితే అక్కడ సరైన గుర్తిం పు కానీ.. సముచిత గౌరవం కానీ లభించలేదని వాపోయారు. అందుకే పార్టీ విధానాలు నచ్చక బయటికి వచ్చి టీడీపీలో చేరామన్నారు. రాష్ట్రా న్ని అభివృద్ధి బాటలో నడిపించగల సత్తా ఉన్న నాయకుడు చంద్రబాబేనని పేర్కొన్నారు. ప్రస్తుతం రాష్ట్రానికి చంద్రబాబు నాయకత్వం ఎంతో అవసరమన్నారు. నియోజకవర్గంలో పరిటాలశ్రీరామ్‌ను భారీ మెజారిటీతో గెలిపించడానికి తమవంతుగా కృషిచేస్తామని తెలిపారు. అనంతరం పరిటాలశ్రీరామ్ మాట్లాడుతూ.. టీడీపీలో కష్టపడి పని చేసేవారికి సముచితస్థానంతోపాటు తగిన గౌరవం ఉంటుందని తెలిపారు. కార్యక్రమంలో పార్టీ మైనార్టీ జిల్లా ప్రధానకార్యదర్శి నాగూర్‌హుస్సేన్, తెలుగుమహిళ నియోజకవర్గ అధ్యక్షురాలు ముతుకూరు బీబీ, నాయకుడు ఉమర్ తదితరులు పాల్గొన్నారు.

25 కుటుంబాలు టీడీపీలోకి చేరిక



మాజీ మంత్రి పల్లె సమక్షంలో టీడీపీలోకి చేరిన వైసీపీ శ్రేణులు

కొత్తచెరువు: మండలకేంద్రానికి చెందిన సుమారు 25 కుటుంబాల వారు వైసీపీని వీడి టీడీపీలోకి చేరారు. వారు జిల్లాకేంద్రంలోని టీ డీపీ కార్యాలయంలో నాయకుడు కాంట్రాక్టర్ లక్ష్మినారాయణ సమక్షంలో, మాజీ మంత్రి పల్లె రఘునాథ రెడ్డి ఆధ్వర్యంలో పార్టీ తీర్థం పుచ్చుకున్నారు. పల్లె రఘునాథ రెడ్డి వారికి కండువాలు వేసి పార్టీలోకి సాదరంగా ఆహ్వానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. వచ్చే ఎన్నికల్లో టీడీపీ విజయానికి ప్రతిఒక్కరూ సైనికుల్లా పని చేయాలని సూచించారు. అనంతరం పార్టీలో చేరిన వారు మాట్లాడుతూ రాష్ట్ర అభివృద్ధి చంద్రబాబుతోనే సాధ్యమని నమ్మి టీడీపీలోకి చేరామన్నారు. కార్యక్రమంలో నాయకులు అడపాల రామకృష్ణ, బండ్లపల్లి రాజు, బీడుపల్లి సుబ్బరాయుడు, గాజులచంద్ర, సుధీర్ తదితరులు పాల్గొన్నారు.



కదిరిలో టీడీపీలోకి చేరిన వారితో కందికుంట వెంకటప్రసాద్ తదితరులు

కదిరిలో 150 కుటుంబాలు..

కదిరి: పట్టణంలోని నిజాంవలీ కాలనీకి చెందిన సుమారు 150 కుటుంబాల వారు వైసీపీని వీడి టీడీపీలోకి చేరారు. కాలనీలో ఆదివారం వారు 14వార్డు కౌన్సిలర్ మహబూబ్‌బాషా, మాజీ కౌన్సిలర్ జిలాన్, తెలుగుయువత జిల్లా అధ్యక్షుడు బాబ్‌జాన్ ఆధ్వర్యంలో, నియోజకవర్గ ఇన్‌చార్జి కందికుంట వెంకటప్రసాద్, నాయకుడు పవన్‌కుమార్ రెడ్డి సమక్షంలో టీడీపీ తీర్థం పుచ్చుకున్నారు. వారికి కందికుంట కండువాలు వేసి పార్టీలోకి సాదరంగా ఆహ్వానించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ వచ్చే ఎన్నికల్లో టీడీపీ విజయానికి ప్రతిఒక్కరూ సైనికుల్లా పని చేయాలని సూచించారు. కష్టపడిన వారికి పార్టీ తగిన గుర్తింపు ఇస్తుందని తెలిపారు. టీడీపీ అధికారంలోకి రాగానే నిజాంవలీ కాలనీలో సమస్యలు పరిష్కరానికి కృషి చేస్తామని పేర్కొన్నారు. కార్యక్రమంలో నాయకులు బంగారు కృష్ణమూర్తి, హిదాయత్, విశ్వనాథ్, సులేమాన్, అయూబ్, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

గాండ్లపెంట: మండలంలోని కటారుపల్లికి చెందిన పలువురు వైసీపీ కార్యకర్తలు టీడీపీ తీర్థం పుచ్చుకున్నారు. కదిరి పట్టణంలోని కందికుంట వెంకటప్రసాద్ నివాసంలో వారు టీడీపీలోకి చేరారు. కందికుంటతో పాటు నాయకుడు పవన్‌కుమార్‌రెడ్డి వారికి కండువాలు వేసి పార్టీలోకి సాదరంగా ఆహ్వానించారు. చేరిన వారిలో కటారుపల్లి ప్రశాంత్‌రెడ్డి, సల్మాన్, శీనా, వెంకటరమణ తదితరులు ఉన్నారు. కార్యక్రమంలో నాయకులు దాసిరెడ్డి, వేణుగోపాల్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



పార్టీలో చేరినవారితో కందికుంట, పవన్

రాములోరి సేవలో ముస్లిం

● ఆలయ నిర్మాణానికి రూ.1.50 లక్షల విరాళం



గ్రామస్థులకు చెక్కు అందజేస్తున్న మస్తాన్‌వలి

తనకల్లు, ఫిబ్రవరి 4: మండలంలోని కొండవెనుకపల్లిలో రామాలయ నిర్మాణానికి ముస్లిం రూ.1.50లక్షలు విరాళం అందజేశారు. కొర్తికోట గ్రామానికి చెందిన టీడీపీ సీనియర్ నాయకుడు, మాజీ సర్పంచ్ ఎస్కే మస్తాన్‌వలి ఆదివారం ఈ మొత్తానికి సంబంధించిన చెక్కును గ్రామస్థులకు అందజేశారు. తమ గ్రామంలో రామాలయం నిర్మిస్తున్నామని, ఇందుకు సహకారం అందించాలని గ్రామస్థులు కోరారు. వెంటనే స్పందించిన ఆయన చెక్కును అందించారు. ముస్లిం సామాజిక వర్గానికి చెందిన వ్యక్తి అయినా.. రామాలయ నిర్మాణానికి అడిగిందే తడువుగా సాయమందించడంపై గ్రామస్థులు అభినందనలు తెలిపారు. అంతేకాకుండా ఆయన్ను శాలువాతో ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో టీడీపీ మండల కన్వీనర్ తొట్లి రెడ్డిశేఖర్ రెడ్డి, నాయకులు, గ్రామస్థులు ఎద్దుల హరినాథ్‌రెడ్డి, దుసాని రాజారెడ్డి, కోటాల కృష్ణారెడ్డి, తొట్లి నాగమల్లురెడ్డి, శివప్రసాద్‌రెడ్డి, మధుసూదన్‌రెడ్డి, బచ్చలి ప్రభాకర్‌రెడ్డి, హైదర్‌వలి, షబ్బీర్‌ఖాన్, చరణ్‌కుమార్, అరవిందరెడ్డి, నాగరాజు, కుళ్లాయిరెడ్డి, శ్రీనివాసరెడ్డి, శ్రీకాంత్‌రెడ్డి, హరినాథ్, రంగప్ప తదితరులు పాల్గొన్నారు.

పూర్వ విద్యార్థుల సమ్మేళనం



సమ్మేళనంలో పాల్గొన్న పూర్వ విద్యార్థులు

ధర్మవరం, ఫిబ్రవరి 4: పట్టణంలోని బీఎస్ఆర్ మున్సిపల్ ఉన్నత పాఠశాలలో 1998-99వ విద్యాసంవత్సరంలో పదో తరగతి చదివిన విద్యార్థులు ఆదివారం గెట్ టూ గెదర్ నిర్వహించారు. సుమారు 25 ఏళ్ల తర్వాత వారందరూ అదే పాఠశాలలో కలుసుకున్నారు. ఒకరినొకరు ఆప్యాయంగా పలకరించుకుని యోగక్షేమాలు అడిగి తెలుసుకున్నారు. నాటి జ్ఞాపకాలను గుర్తు చేసుకున్నారు. ఉదయం నుంచి సాయంత్రం వరకు ఆనందంగా గడిపారు. నాటి గురువులు శ్రీనివాసరెడ్డి, యజ్ఞన్న, లక్ష్మీనారాయణ, నాగభూషణ, హరిప్రసాద్‌లను శాలువాలతో సత్కరించారు.

రామాపురంలో భవిష్యత్తుకు గ్యారెంటీ



భవిష్యత్తుకు గ్యారెంటీలో పాల్గొన్న టీడీపీ శ్రేణులు

తాడిమర్రి, ఫిబ్రవరి 4: మండలంలోని రామాపురం గ్రామంలో ఆదివారం టీడీపీ నాయకులు, కార్యకర్తలు బాబుష్యూరిటీ భవిష్యత్తుకు గ్యారెంటీ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భగా ప్రతి ఇంటికీ వెళ్లి ప్రజలకు కరపత్రాలు పంచుతూ చంద్రబాబు ప్రకటించిన మినీమేనిఫెస్టో పథకాలను వివరించారు. చంద్రబాబు సీఎం అయితే అన్ని వర్గాల ప్రజలకు మేలు జరుగుతుందని తెలిపారు. తర్వాత గ్రామంలో కేన్సర్‌తో బాధపడుతున్న ఓ యువకుడికి రూ.10వేలు ఆర్థిక సాయం అందజేశారు. కార్యక్రమంలో మండల కన్వీనర్ కూచిరామ్మోహన్, సీనియర్ నాయకులు రఘురాం చౌదరి, ఆదినారాయణ, సాయి, శేఖర్, ధనుంజయనాయుడు, శ్రీనివాసరెడ్డి, విశ్వనాథ్, పాపానాయుడు, రమణ తదితరులు పాల్గొన్నారు.

జిల్లాస్థాయి వాలీబాల్ పోటీల్లో గౌనిపల్లి విద్యార్థుల ప్రతిభ



కలెక్టర్ నుంచి ట్రోఫీ అందుకుంటున్న గౌనిపల్లి విద్యార్థులు

ఓబుళదేవరచెరువు, ఫిబ్రవరి 4: జిల్లాస్థాయి వాలీబాల్ పోటీల్లో మండలంలోని గౌనిపల్లి జిల్లాపరిషత్ విద్యార్థులు తృతీయస్థానం పొందినట్లు వ్యాయామ ఉపాధ్యాయుడు రాంబాబు తెలిపారు. ఆడుదాం ఆంధ్ర క్రీడల్లో భాగంగా కొత్తచెరువులో శనివారం జరిగిన వాలీబాల్ పోటీల్లో జిల్లా స్థాయిలో తృతీయస్థానాన్ని గౌనిపల్లి విద్యార్థులు సాధించినట్లు చెప్పారు. క్రీడాకారులకు కలెక్టర్ అరుణ్‌బాబు, ఆర్డీవో భాగ్యరేఖ, ట్రోఫీతోపాటు ప్రశంసాపత్రాలను అందించారని తెలిపారు.

కళ్లు మూసుకుని నిరసన

ఓబుళదేవరచెరువు, ఫిబ్రవరి 4: ఇళ్ల పట్టాలు పంపిణీ చేయాలంటూ మండలకేంద్రంలో భవన నిర్మాణ కార్మికులు చేపట్టిన రిలే దీక్ష ఆదివారం నాటికి ఆరో రోజుకు చేరింది. ఈ క్రమంలో కార్మికులు దీక్షా శిబిరంలో మోకాళ్లపై నిలబడి, రెండు చేతులతో కళ్లు మూసుకుని వినూత్న నిరసన తెలిపారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ .. ఇప్పటికైనా అధికారులు స్పందించి తమకు ఇంటిపట్టాలు ఇవ్వాలన్నారు. ఆరో రోజులుగా దీక్ష చేస్తున్నా పట్టించుకోవడం లేదని వాపోయారు. ఇప్పటికైనా స్పందించాలని కోరారు. వారికి సీఐటీయూ మండల అధ్యక్ష, కార్యదర్శులు శ్రీరాములు, కుళ్లాయప్ప మద్దతు పలికారు. కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా నాయకుడు సాంబశివ, భవన నిర్మాణ కార్మిక అధ్యక్ష, కార్యదర్శులు కిష్టప్ప, కేశప్ప పాల్గొన్నారు.



కళ్లు మూసుకుని నిరసన తెలుపుతున్న భవన నిర్మాణ కార్మికులు

రెండు నెలల్లో వైసీపీ కథ కంచికి..

● జనసేన రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చిలకం మధు



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న చిలకం మధుసూదన్ రెడ్డి

ధర్మవరం, ఫిబ్రవరి4: మరో రెండు నెలల్లో వైసీపీ కథ కంచికి పోనుందని, సీఎం జగన్ రెడ్డి తట్టాబుట్టా సర్దుకోవాల్సిందేనని జనసేన రాష్ట్ర ప్రధానకార్యదర్శి చిలకం మధుసూదన్‌రెడ్డి పేర్కొన్నారు. పట్టణంలోని తన స్వగృహంలో ఆదివారం ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. ఏలూరు జిల్లా దెందులూరు సభలో టీడీపీ, జనసేన అధినేతలు చంద్రబాబు, పవన్‌కళ్యాణ్‌పై సీఎం జగన్ చేసిన వ్యాఖ్యలకు ఆయన ఘాటుగా స్పందించారు. జగన్‌రెడ్డి ముఖ్యమంత్రి స్థాయిని మరచి నోటికి వచ్చినట్టు మాట్లాడటం సిగ్గుచేటన్నారు. అధికారం ఉంది కదా అని నోటికి వచ్చినట్టు మాట్లాడితే చూస్తూ ఊరుకోమన్నారు. జగన్‌ను ఇంటికి సాగనంపడానికి ప్రజలు సిద్ధంగా ఉన్నారన్నారు. సార్వత్రిక ఎన్నికలలో టీడీపీ, జనసేన ప్రభుత్వం రావడం ఖాయమని ఆయన దీ మా వ్యక్తం చేశారు.

రోడ్డు ప్రమాదంలో యువకుడి మృతి

రొద్దం, ఫిబ్రవరి 4: మండలంలోని చెరుకూరు కు చెందిన కురుబ గంగాధరప్ప కుమారుడు ఆనంద్(28) గుర్తుతెలియని వాహనం ఢీకొని అక్కడికక్కడే మృతి చెందాడు. రొద్దం మండలం చెరుకూరుకు చెందిన ఆనంద్ తల్లి ద్రండుల గ్రామ సమీపాన ఉన్న తమ వ్యవసాయ పొలంలో పనులు చేస్తున్నారు. ఆనంద్ ద్విచక్రవాహనంలో అక్కడి నుంచి తండ్రిని ఇంటి వద్ద వదిలి తిరిగి పొలం వద్దకు వెళ్లాడు. తల్లి మరలా వస్తానని చెప్పడంతో అతడు ద్విచక్రవాహనంపై తిగిరి ఇంటికి వస్తుండగా పె నుకొండ - మడకశిర రహదారిపై టింబక్టివ్ కలెక్టివ్ కార్యాలయం వద్ద గుర్తుతెలియని వాహనం ఢీకొంది. ఈ ప్రమాదంలో ఆనంద్ తలకు తీవ్ర గాయం కావడంతో అక్కడికక్కడే మృతిచెందాడు. స్థానికులు గమనించి బంధువులకు, పోలీసులకు సమాచారం అందించారు. ఎస్‌ఐ వలీబాష సంఘటనా స్థలాన్ని పరిశీలించారు. ఈ మేరకు కేసు నమోదుచేసి దర్యాప్తుచేస్తున్నట్లు పోలీసులు తెలిపారు. మృతుడికి భార్య లిఖిత, ఏడు నెలల కుమారుడు ఉన్నాడు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం పెనుకొండ ప్రభుత్వాసుపత్రికి తరలించారు. మృతుడు పెనుకొండ కియ అనుబంధ పరిశ్రమలో పనిచేస్తున్నట్లు గ్రామస్థులు తెలిపారు.

ఆలయ కమిటీ సమావేశానికి మహిళా డైరెక్టర్ల డుమ్మా



ఆలయంలో కమిటీ సమావేశం నిర్వహిస్తున్న దృశ్యం

లేపాక్షి, ఫిబ్రవరి 4 : ప్రపంచ ప్రసిద్ధిగాంచిన లేపాక్షిలోని దుర్గా, వీరభద్ర స్వామి ఆలయానికి ఇటీవల నూతనంగా కమిటీని ఏర్పాటు చేశారు. ఏడుగురు సభ్యులతో కమిటీ ఏర్పాటు అయింది. వారిలో నలుగురు పురుషులు, ముగ్గురు మహిళలు సభ్యులుగా ఉన్నారు. కమిటీ సభ్యులు మొత్తం అధికార పార్టీకి చెందిన వారే కావడం గమనార్హం. ఈ క్రమంలో ఆలయ పరిపాలన వ్యవస్థ, భక్తులకు కల్పించాల్సిన సౌకర్యాలపై ఆదివారం మొదటి సమావేశం నిర్వహించారు. అయితే ఆలయ ప్రాంగణంలో జరిగిన ఈ సమావేశానికి మహిళా డైరెక్టర్లు శాంతమ్మ, మంజుల, సాయిలీల గైర్హాజరయ్యారు. సాయిలీల స్థానంలో ఆమె భర్త మదన్, మంజుల స్థానంలో ఆమె భర్త గోపి హాజరయ్యారు. సమావేశంలో వీరే హల్‌చల్ చేశారు. దీనిపై ఆలయ కమిటీ చైర్మన్ మాట్లాడకపోవడం విచారకరమని గ్రామస్థులు అంటున్నారు. ఆలయ అభివృద్ధికి కృషిచేయాల్సిన మహిళా డైరెక్టర్లు మొదటి సమావేశానికే డుమ్మా కొట్టడం, వారి స్థానంలో బంధువులు హాజరు కావడంపై మండల ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. జరగబోయే సమావేశాలకైనా డైరెక్టర్లే హాజరు కావాలని కోరుతున్నారు. అయితే దీనిపై అధికారులు సైతం నోరు మెదపకపోవడం గమనార్హం.

బత్తలపల్లి తహసీల్దార్‌గా శివశంకర్‌నాయక్

బత్తలపల్లి, ఫిబ్రవరి4: బత్తలపల్లి మండల తహసీల్దార్‌గా శివశంకర్‌నాయక్ నియమితులయ్యారు. గతంలో ఇక్కడ పని చేస్తున్న యుగేశ్వరిదేవిపై అవినీతి ఆరోపణలు వచ్చాయి. దీంతో కలెక్టర్ అరుణ్‌బాబు గతనెల 24వ తేదీన ఆమెను విధుల నుంచి సస్పెండ్ చేశారు. అప్పటి నుంచి తాడిమర్రి తహసీల్దార్ నాగరాజు ఇన్‌చార్జిగా వ్యవహరిస్తున్నారు. ఈ క్రమంలో కర్నూలు జిల్లా గూడూరు తహసీల్దార్‌గా ఉన్న శివశంకర్‌నాయక్‌ను ప్రభుత్వం బత్తలపల్లికి బదిలీ చేసింది.

ఉచిత కంటి వైద్య శిబిరం

ధర్మవరం, ఫిబ్రవరి 4: పట్టణంలోని ప్రభుత్వ బాలుర ఉన్నతపాఠశాలలో ఆదివారం యువర్స్ ఫౌండేషన్ సహకారంతో కడపకు చెందిన పుష్పగిరి కంటి ఆస్పత్రి వారు ఉచిత కంటి వైద్య శిబిరాన్ని నిర్వహించారు. ఇందులో 105 మందికి కంటి పరీక్షలు నిర్వహించి.. అందులో 71 మందిని శస్త్రచికిత్సలకు ఎంపిక చేసినట్టు ఫౌండేషన్ అధ్యక్ష,కార్యదర్శులు శీలానాగేంద్ర, జయరాం తెలిపారు. కార్యక్రమంలో ఫౌండేషన్ జాయింట్ సెక్రెటరీ నాగార్జున, కోశాధికారి బండి నాగేంద్ర, పీఆర్వో రాధాకృష్ణ, సభ్యులు డాక్టర్ సుబ్బారావు, చాంద్‌బాషా, శ్రీకాంత్‌రెడ్డి, ఖలీల్, మల్లికార్జున, రమేశ్‌బాబు తదితరులు పాల్గొన్నారు.

గొడవలకు దూరంగా ఉండండి

బత్తలపల్లి, ఫిబ్రవరి4: గ్రామాల్లో ప్రజలు గొడవలకు దూరంగా ఉండాలని, సమస్యలుంటే సామరస్యంగా పరిష్కరించుకోవాలని ఎస్‌ఐ శ్రీనివాసులు సూచించారు. మండలంలోని తంబాపురం, జ్వాలాపురం గ్రామాల్లో ఆదివారం ఆయన సిబ్బందితో కలిసి కార్డెన్ సెర్చ్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఫ్యాక్షన్ లీడర్లు, మద్యం, గుట్కా అమ్మేవారి ఇళ్లలో తనిఖీలు చేపట్టారు. అనంతరం ఆయా గ్రామస్థులతో సమావేశమై మాట్లాడారు. త్వరలోనే ఎన్నికలు జరగనున్నాయని, ప్రజలు ఎవరైనా గొడవలకు దిగితే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. అందరూ ప్రశాంత జీవనం గడపాలన్నారు. సమస్యలుంటే సామరస్యంగా పరిష్కరించుకోవాలన్నారు. కక్షలకు దూరంగా ఉండాలన్నారు. గ్రామాల్లో ఎవరైనా పేకాట ఆడినా, మద్యం, గుట్కా అమ్మినా పోలీసులకు సమాచారం ఇవ్వాలని కోరారు.

బుక్కపట్నం ఎస్‌ఐగా సురేష్‌బాబు బాధ్యతలు



బాధ్యతలు స్వీకరించిన ఎస్‌ఐ సురేష్‌బాబు

బుక్కపట్నం, ఫిబ్రవరి4: మండలకేంద్రంలోని పోలీస్‌స్టేషన్‌లో నూతన ఎస్‌ఐగా సురేష్‌బాబు ఆదివారం బాధ్యతలు చేపట్టారు. కొత్తచెరువు పోలీస్ స్టేషన్‌లో ఎస్‌ఐగా పనిచేస్తున్న ఇతను బదిలీపై ఇక్కడికి వచ్చారు. ఇక్కడ పని చేస్తున్న ఎస్‌ఐ నరసింహుడు పట్నం స్టేషన్‌కు బదిలీ అయ్యారు. బాధ్యతలు చేపట్టిన అనంతరం సురేష్‌బాబు మాట్లాడుతూ మండలంలో శాంతి భద్రతల పరిరక్షణకు కృషి చేస్తానని పేర్కొన్నారు.

వైసీపీ హయాంలో ముస్లింల పథకాలన్నీ రద్దు



ముస్లింలకు యాసిన్ సూర ఫొటోను అందజేస్తున్న దృశ్యం

తాడిమర్రి, ఫిబ్రవరి 4: వైసీపీ ప్రభుత్వం అధికారంలోకి రాగానే ముస్లిం మైనార్టీలకు వచ్చే పథకాలన్నీ రద్దు చేసిందని టీడీపీ హిందూపురం పార్లమెంట్ మైనార్టీ ప్రధాన కార్యదర్శి నాగూర్‌హుస్సేన్ పేర్కొన్నారు. మండలకేంద్రంలో ఆదివారం ముస్లిం నాయకుల ఆధ్వర్యంలో ఆయన ముస్లిం కుటుంబాలు పవిత్రంగా భావించే యాసిన్ సూర ఫొటోలను ఇంటింటికీ వెళ్లి పంపిణీ చేశారు. అనంతరం మాట్లాడుతూ నియోజకవర్గ టీడీపీ ఇన్‌చార్జి పరిటాల శ్రీరామ్ సూచనల మేరకు ఈ కార్యక్రమాన్ని తలపెట్టినట్టు తెలిపారు. తెలుగుదేశం ప్రభుత్వ హయాంలో ముస్లింలకు అనేక సంక్షేమ పథకాలు అందేవన్నారు. ఆ పథకాలన్నీ వైఎస్ జగన్ అధికారంలోకి రాగానే రద్దు చేశారన్నారు. మళ్లీ టీడీపీ అధికారంలోకి వస్తే ఆ పథకాలన్నింటినీ పునరుద్ధరించడం జరుగుతుందన్నారు. కార్యక్రమంలో నియోజకవర్గ ముస్లిం మైనార్టీ సెల్ అధ్యక్షుడు అత్తర్ రహీంబాషా, మైనార్టీ నాయకులు రాళ్లపల్లిషరీఫ్, సలీంబాషా పాల్గొన్నారు.

వాల్మీకి బోయసంఘం కమిటీల ఏర్పాటు



నియామక పత్రాలు అందజేస్తున్న బంగారు కృష్ణమూర్తి

కదిరి, ఫిబ్రవరి 4: ఆంధ్రప్రదేశ్ వాల్మీకి బోయ సంఘం జిల్లా, తాలూకా, మండల కమిటీలను ఏర్పాటు చేసినట్లు ఆ సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు బంగారు కృష్ణమూర్తి తెలిపారు. ఈ క్రమంలో ఎంపికైన పలు కమిటీ సభ్యులకు ఆయన పట్టణంలోని తన నివాసంలో ఆదివారం నియామక పత్రాలు అందించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. బోయలు ఎస్టీ సాధనపై గ్రామస్థాయి నుంచి పోరాటం చేయాలని సూచించారు. కార్యక్రమంలో వాల్మీకి సంఘం నాయకులు మోహన్, ధనుంజయ, శివప్రసాద్, వీరనారప్ప, అశోక్, చిన్ననరసింహులు, ప్రసాద్, బాస్కర్ తదితరులు పాల్గొన్నారు.

అంధకారంలో జాతీయ రహదారి

● వెలగని విద్యుత్ లైట్లు ● పట్టించుకోని అధికారులు

తనకల్లు, ఫిబ్రవరి 4: మండలకేంద్రంలోని 42వ జాతీయ రహదారి అంధకారంలో మగ్గుతోంది. ఏర్పాటు చేసిన విద్యుత్ లైట్లు పని చేయడం లేదు. దీంతో చీకటి పడగానే రహదారిలో గాఢాంధకారం నెలకొంటోంది. ఈ రహదారి మధ్యలో డివైడర్లు నిర్మించి, పెద్ద విద్యుత్ స్తంభాలను ఏర్పాటు చేసి, లైట్లు సైతం వేశారు. కొంతకాలంగా బాగా పనిచేసిన లైట్లు ఉన్నఫలంగా వెలగడం ఆగిపోయాయి. ఇలా మూడునెలలు కావస్తోంది. అయితే ఇంతవరకూ సంబంధితాధికారులెవరూ పట్టించుకోలేదు. దీంతో తనకల్లులోని జాతీయ రహదారి అంధకారంలో ఉంది. రాత్రి వేళల్లో ఎవరైనా రహదారిలో నడిచి వెళ్లాలంటే భయాందోళనకు గురి కావాల్సి వస్తోందని గ్రామస్థులు వాపోతున్నారు. సమస్యను పలుమార్లు పంచాయతీ అధికారులకు విన్నవించినా ఫలితం లేకపోయిందంటున్నారు. ఇప్పటికైనా అధికారులు, ప్రజాప్రతినిధులు స్పందించి జాతీయ రహదారిలో విద్యుత్‌లైట్లు వేయాలని వారు కోరుతున్నారు.

సచివాలయం ఎదుటే చెత్తాచెదారం

● దుర్గంధంతో ఇబ్బంది పడుతున్న ప్రజలు



సచివాలయం ఎదుట పేరుకుపోయిన చెత్త

కొత్తచెరువు, ఫిబ్రవరి4 : మండలకేంద్రంలోని సచివాలయం-2 వద్ద చెత్తాచెదారం పేరుకుపోయింది. పరిసర ప్రాంతాలకు చెందిన వారు ఇళ్లల్లోని చెత్తను తెచ్చి సచివాలయం ఎదుటే పడేస్తున్నారు. దీంతో ఆ ప్రాంతం చెత్తదిబ్బలా మారిపోయి దుర్వాసన వెదజల్లుతోంది. సచివాలయానికి వివిధ పనుల నిమిత్తం వచ్చే ప్రజలు దుర్గంధం భరించలేక ఇబ్బందులు పడుతున్నారు. ప్రభుత్వం పరిసరాలు పరిశుభ్రంగా ఉంచుకోవాలని అవ గాహన కల్పించకపోవడంతోనే ప్రజలు రోడ్లపై, వీధుల్లో చెత్తను పడేస్తున్నారు. సచివాలయం ఎదుటే చెత్తా చెదారం ఇలా ఉంటే.. ఇక వీధులలో పరిస్థితి ఏ విధంగా ఉంటుందోనని పలువురు స్థానికులు పేర్కొంటున్నారు.

నేటి నుంచి కొల్హాపురమ్మ ఉత్సవాలు

అగళి, ఫిబ్రవరి 4: మండలంలోని కోడిపల్లి లో సోమవారం నుంచి బుధవారం వరకు మూడు రోజుల పాటు రత్నగిరి కొల్హాపురి మహాలక్ష్మీ దేవి జ్యోతుల ఉత్స వాలు అంగరంగ వైభవంగా నిర్వహిస్తున్నట్లు సర్పంచ్ నరసింహమూర్తి, వాల్మీకి సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు రమేష్ తెలిపారు. కొల్హాపురమ్మను సోమవారం రత్నగిరి నుంచి ఊరేగింపుగా తీసుకొచ్చి పట్టము కడతారని తెలి పారు. మంగళవారం అమ్మవారిని వివిధ పూలతో అలంక రించి పూజలు నిర్వహిస్తారని, మహిళలు భక్తిశ్రద్ధలతో హారతులు మోస్తూ మొక్కుబడులు తీర్చుకుంటారని తెలిపారు. యథావిధిగా బుధవారం అమ్మవారు ఇంటిం టికి వెళ్లి వడిబియ్యం కట్టించుకుని అదేరోజు సాయంత్రం రత్నగిరికి చేర్చనున్నట్లు తెలిపారు. భక్తులు అధిక సంఖ్య లో తరలిరావాలని కోరారు.

పుట్టపర్తికి కొత్త బస్సు సర్వీసు

మడకశిరటౌన్, ఫిబ్రవరి 4: ఆర్టీసీ మడకశిర డిపో నుంచి జిల్లా కేంద్రమైన పుట్టపర్తికి కొత్తగా పల్లెవెలుగు బస్సు నడపనున్నట్లు స్థానిక డిపో మేనేజర్ రామసుబ్బ య్య తెలిపారు. సోమవారం నుంచి సర్వీసును నడుపుతు న్నామని ఆయన ఆదివారం ఓ ప్రకటనలో తెలిపారు. ఉదయం 7 గంటలకు అగళి మండల కేంద్రంలో బయ లుదేరిన బస్సు మడకశిర, పెనుకొండ, కొత్తచెరువు మీ దుగా ఉదయం 10 గంటలకు పుట్టపర్తి చేరుకుంటుం దన్నారు. తిరిగి సాయంత్రం 4.30కు పుట్టపర్తిలో బయ లుదేరి రాత్రికి అగళి చేరుకుంటుందని తెలిపారు. ప్రయాణికులు ఈఅవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని డీఎం కోరారు.

మడకశిర ఎంపీడీఓగా దాసరి మేరీ

మడకశిరటౌన్, ఫిబ్రవరి 4: స్థానిక ఎంపీడీఓగా కే దాసరి మేరీని నియమిస్తూ ఉన్నతాధికారులు ఆదేశాలు జారీ చేశారు. మడకశిర ఎంపీడీఓగా పనిచేస్తున్న సోనీ బాయిను కర్నూల్ జిల్లాకు బదిలీ చేశారు. కర్నూల్ జిల్లా నుంచి దాసరిమేరీని మడకశిర ఎంపీడీఓగా నియమిం చినట్లు స్థానిక కార్యాలయం సిబ్బంది తెలిపారు. ఆమె సోమవారం బాధ్యతలు స్వీకరిస్తున్నట్లు తెలిపారు.

షర్మిల పర్యటన వాయిదా

మడకశిరటౌన్, ఫిబ్రవరి 4: పీసీసీ అధ్యక్షురాలు షర్మిల పర్యటన తాత్కాలికంగా వాయిదా పడినట్లు మాజీ ఎమ్మెల్యే కే సుధాకర్ ఆదివారం ఓ ప్రకటనలో తెలిపారు. షర్మిల సోమవారం మడకశిరలో రోడ్‌షోలో, బహిరంగ సమావేశంలో పాల్గొనేందుకు వస్తున్నట్లు షెడ్యూల్ ప్రకటించారని, కొన్ని అనివార్య కారణాల వల్ల తాత్కాలికంగా ఆమె పర్యటన వాయిదాపడినట్లు తెలిపా రు. త్వరలో షర్మిల మడకశిర పర్యటన ఉంటుందని, తేదీలు ప్రకటిస్తామని ఆయన తెలిపారు. నాయకులు, కార్యకర్తలు గమనించాలని కోరారు.

బైక్‌లను ఢీకొన్న కేఎస్ ఆర్టీసీ బస్సు

ఇద్దరికి తీవ్రగాయాలు



ప్రమాదానికి కారణమైన కేఎస్ ఆర్టీసీ బస్సు



దెబ్బతిన్న ద్విచక్రవాహనం

హిందూపురం అర్బన్, ఫిబ్రవరి 4: పట్టణంలోని చర్చి రోడ్డు క్రాస్‌లో ఆదివా రం కేఎస్ఆర్టీసీ బ స్సు ఢీకొనడంతో రెం డు వేర్వేరు ద్విచక్ర వాహనాల్లో వెళ్తున్న ఇద్దరు తీవ్రంగా గా యపడ్డారు. బెంగళూ రుకు చెందిన కు మార్, హిందూపు రంలోని డీబీ కాలనీకి చెందిన నాగరాజుశెట్టి పట్టణం లోని చర్చి రోడ్డు క్రాస్‌లో వేర్వేరు ద్విచక్రవాహనాల్లో వెళ్తున్నారు. వెనుక వైపు నుంచి వచ్చిన కేఎస్ ఆర్టీసీ బస్సు ఢీకొనడంతో ద్విచక్రవాహనాల్లో నుంచి వారు కింద పడ్డారు. ఈ ప్రమాదంలో ఇద్దరి తలలకు తీవ్ర గాయాలయ్యాయి. వారిని స్థానికులు ఆటోలో హిందూ పురం ప్రభుత్వాసుపత్రికి తరలించారు. అక్కడ వైద్యులు చికిత్సలు అందించారు. గౌరీబిదనూరు వద్ద కూడా ఆ బస్సు డ్రైవర్ ఇలాగే దురుసుగా వచ్చాడని ప్రయాణికులు ఫిర్యాదు చేసినట్లు సమాచారం. కేసు నమోదు చేసుకుని, దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో యువకుడి మృతి

రొద్దం, ఫిబ్రవరి 4: మండలంలోని చెరుకూరు కు చెందిన కురుబ గంగాధరప్ప కుమారుడు ఆనంద్(28) గుర్తుతెలియని వాహనం ఢీకొని అక్కడికక్కడే మృతిచెం దాడు. రొద్దం మండలం చెరుకూరుకు చెందిన ఆనంద్ తల్లిదండ్రుల గ్రామ సమీపాన ఉన్న తమ వ్యవసాయ పొలంలో పనులు చేస్తున్నారు. ఆనంద్ ద్విచక్రవాహనం లో అక్కడి నుంచి తండ్రిని ఇంటి వద్ద వదిలి తిరిగి పొ లం వద్దకు వెళ్లాడు. తల్లి మరలా వస్తానని చెప్పడంతో అతడు ద్విచక్రవాహనంపై తిరిగి ఇంటికి వస్తుండగా పె నుకొండ-మడకశిర రహదారిపై టింబక్టివ్ కలెక్టివ్ కార్యాలయం వద్ద గుర్తుతెలియని వాహనం ఢీకొంది. ఈ ప్రమాదంలో ఆనంద్ తలకు తీవ్ర గాయం కావడంతో అక్కడికక్కడే మృతిచెందాడు. స్థానికులు గమనించి బంధువులకు, పోలీసులకు సమాచారం అందించారు. ఎస్ఐ వలీబాష సంఘటనా స్థలాన్ని పరిశీలించారు. ఈ మేరకు కేసు నమోదుచేసి దర్యాప్తుచేస్తున్నట్లు పోలీసు లు తెలిపారు. మృతుడికి భార్య లిఖిత, ఏడు నెలల కుమారుడు ఉన్నాడు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం పెనుకొండ ప్రభుత్వాసుపత్రికి తరలించారు. మృతుడు పెనుకొండ కియ అనుబంధ పరిశ్రమలో పనిచేస్తున్నట్లు గ్రామస్థులు తెలిపారు.

మహిళ ఆత్మహత్యాయత్నం

గోరంట్ల, ఫిబ్రవరి 4: మండలంలోని మలసముద్రం గ్రామానికి చెందిన అశ్వత్థమ్మ అనే మహిళ క్రిమిసంహా రక మందు తాగి ఆదివారం ఆత్మహత్యాయత్నానికి పాల్పడింది. బంధువులు తెలిపిన మేరకు... మలస ముద్రం గ్రామానికి చెందిన రంగప్ప భార్య అశ్వత్థమ్మ కొడుకు, కోడలితో కలిసి నివసిస్తోంది. కుటుంబ కలహాల కారణంగా ఆదివారం అశ్వత్థమ్మ మనస్థాపానికి గు రైంది. ఇంట్లోని క్రిమిసంహార మందు తాగి ఆత్మహత్యా యత్నానికి పాల్పడింది. వెంటనే కుమారుడు, బంధువు లు ఆమెను ఆటోలో గోరంట్ల ప్రభుత్వాసుపత్రికి తరలిం చారు. ప్రథమచికిత్స అనంతరం మెరుగైన చికిత్సకోసం ప్రయివేటు వాహనంలో హిందూపురం తరలించారు.

తవ్వేకొద్దీ అక్రమాలు..!

- అడుగడుగున అక్రమ కనెక్షన్లు
- విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్లనూ వాడేసిన వైనం
- పెదవి విప్పని ఉన్నతాధికారులు



పలగలపల్లి, నేసేవాండ్లపల్లిల్లో ఆయా గ్రామాలకు ఏర్పాటుచేసిన ట్రాన్స్‌ఫార్మర్లను తొలగించిన దృశ్యాలు

చిలమత్తూరు, ఫిబ్రవరి 4: మండలంలో విద్యుత్ శాఖకు సంబంధించి అవినీతి అక్రమాలకు కొదవేలేకుండా పోతోంది. తవ్వేకొద్దీ అగుగడునా అక్రమాలే కనిపిస్తున్నాయి. యథేచ్ఛగా అక్రమాలు జరుగుతున్నా సంబంధిత అధికారులు చూసీచూడనట్లు వ్యవహరించడంపై తీవ్ర విమర్శలు వ్యక్తమవుతున్నాయి. మండలంలో విద్యుత్ శాఖలో కింది స్థాయి లైన్‌మన్లు, కాంట్రాక్టర్లు కీలకంగా మారి ఇష్టానుసారంగా అక్రమ కనెక్షన్లు ఇచ్చేస్తున్నట్లు తెలుస్తోంది. దీని వలన ప్రభుత్వం భారీగా ఆదాయం కోల్పోవడమే కాకుండా నిజమైన వినియోగదారుల కు తీవ్ర అన్యాయం జరుగుతోంది. ప్రభుత్వ నిబంధనల ప్రకారం దరఖాస్తు చేసుకున్న వారికి విద్యుత్ కనెక్షన్ ఇవ్వడానికి మీనమేషాలు లెక్కించే అధికారు లు... ఇలా నిబంధనలను తుంగలో తొక్కి అధికారులతో పనిలేకుండా లైన్‌మన్లు, కాంట్రాక్టర్లు సొంత సొమ్ములా అక్రమాలకు పాల్పడుతున్నా మిన్నకుండి పోతున్నారని మండలంలోని ప్రజలు అంటున్నారు.

ట్రాన్స్‌ఫార్మర్లను సైతం వాడేశారు..

ఎన్నో రోజులుగా లోఓల్టేజీ కారణంగా ఇబ్బందులు పడుతున్న పలగలపల్లి, నేసేవాండ్లపల్లి గ్రామస్థులకు ప్రభుత్వం అదనపు గృహోపకరణ విద్యుత్ ట్రాన్స్ ఫార్మర్లను ఏర్పాటుచేసింది. దీంతో ఆ గ్రామాల్లో లోఓల్టేజీ సమస్య తీరింది. కానీ ఈ సంతోషం గ్రామస్థులకు ఎన్నో రోజులు లేకపోయింది. ఈ రెం డు గ్రామాల్లో ఉన్న అదనపు ట్రాన్స్‌ఫార్మర్లపై కింది స్థాయి ఉద్యోగులు, కాంట్రాక్టర్ల కన్ను పడింది. ఏర్పాటుచేసిన అదనపు ట్రాన్స్‌ఫార్మర్లను ఎలాంటి ఉన్నతాధికారుల అనుమతి లేకుండా ఇటీవల ప్రైవేటు వ్యక్తులకు ఏర్పాటుచేసి పెద్ద మొత్తంలో డబ్బులు వసూలు చేసినట్లు గ్రామస్థులు పేర్కొంటున్నారు. వీళ్ల చే సిన పని కారణంగా ఈ రెండు గ్రామాలకు మళ్లీ లో ఓల్టేజీ సమస్య మొదలైంది. అయితే ఏకంగా విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్లను మాయం చేసిన కింది స్థాయి ఉద్యోగులపై విద్యుత్ శాఖ ఉన్నతాధికారులకు ఫిర్యాదులు చేసినా స్పం దించడంలేదని గ్రామస్థులు తెలుపుతున్నారు. అసలు ప్రభుత్వం ఏర్పాటు చేసిన రెండు ట్రాన్స్‌ఫార్మర్లు ఎందుకు తొలగించారు? వాటిని ఎక్కడ ఏర్పాటు చేశారు? అనే విషయాలపై ఇప్పటికీ ఉన్నతాధికారులు పరిశీలించకపోవడం విశేషం.

వినియోగంలో లేని విద్యుత్ స్తంభాల సంగతేంటి?

ఇటీవల విద్యుత్ శాఖ హెచ్‌డీఎఫ్‌సీ పథకం ద్వారా నాణ్యమైన విద్యుత్ ఇవ్వ డం కోసం ప్రతి రైతుకు విద్యుత్ కనెక్షన్ల సరళ ప్రక్రియ చేపట్టారు. ఈ పథకం లో భాగంగా చేపట్టిన పనుల్లో చాలా చోట్ల విద్యుత్ స్తంభాలు నిరుపయోగంగా మారాయి. దీంతో ఆ విద్యుత్ స్తంభాలను సంబంధిత విద్యుత్ శాఖకు రిటర్న్ చేయడం కానీ లేదా వాటిని అధికారికంగా ఇచ్చే కొత్త కనెక్షన్లకు వాడుకోవచ్చు. అయితే ఆ స్తంభాలను, విద్యుత్ తీగలను ఉన్నతాధికారుల అనుమతులు లేకుం డానే అక్రమ కనెక్షన్లకు వాడేస్తున్నట్లు విమర్శలున్నాయి. ఇలా అక్రమ కనెక్షన్లకు వాడే సామగ్రికి అయ్యే ఖర్చును కూడా సంబంధిత వినియోగదారుల నుంచి పెద్ద మొత్తంలో వసూలు చేస్తూ ప్రభుత్వ ఆదాయానికి భారీగా గండికొడు తున్నారని మండలంలో విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. ఇదిలా ఉండగా విద్యుత్ అధికారులు సమయానికి స్పందించక పోవడంతో పలు గ్రామాల్లో రైతులు విద్యుత్ తీగలను కర్రలకు ఏర్పాటు చేసుకుని పంటలు పండించుకుంటున్నారు.

నోరుమెదపని ఉన్నతాధికారులు

చిలమత్తూరు మండలంలో ఇంత జరుగుతున్నా విద్యుత్ శాఖలోని అవినీతి అక్రమాలపై ఉన్నతాధికారులు పెదవి విప్పడం లేదు. ఏకంగా పైఅధికారి అనుమతులు లేకుండా విద్యుత్ కనెక్షన్లు ఇవ్వడం, గ్రామాలకు ఏర్పాటుచేసిన విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్లను ప్రైవేటు వ్యక్తులకు చేరవేస్తున్నా స్పందించడం లేదు. కింది స్థాయి ఉద్యోగులు చేస్తున్న అక్రమాలపై ఉన్నతాధికారులు స్పందించకపోవడం పలు ఆరోపణలకు తావిస్తోంది. ఇప్పటికైనా జిల్లా ఉన్నతాధి కారులు స్పందించి మండలంలో విద్యుత్ శాఖలో జరుగుతున్న అక్రమాలపై విచారణ చేపట్టి బాధ్యులపై చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

లక్ష్మీరంగనాథస్వామికి ప్రత్యేక పూజలు



ఆలయంలో ప్రత్యేక పూజలు చేస్తున్న డాక్టర్ సునీల్

రొళ్ల, ఫిబ్రవరి 4: మండలంలోని కాలువేపల్లి లక్ష్మీరంగనాథస్వామి ఆల యాన్ని మాజీ ఎమ్మెల్యే మద్దన కుంట ఈరన్న తనయుడు డాక్టర్ సునీల్ సం దర్శించి ప్రత్యేక పూజలు జరిపించారు. తన తండ్రి మాజీ ఎమ్మెల్యే ఈరన్న సేవలు గుర్తించి, తెలుగుదేశం పార్టీ అధికారంలోకి రావాలని పూజలు జరిపించినట్లు తెలిపా రు. ఈ సందర్భంగా మాజీ ఎంపీటీసీ రాజన్న, శ్రీరంగప్ప, డైరెక్టర్ రామన్న, రవికుమార్, నారాయణప్ప, ఈర క్యాతరాయ, అగళి ఎంపీటీసీ నాగోజి, మల్లినమడుగు ఎస్సీ సెల్ రంగనాథ్, బండి రమేష్ పాల్గొన్నారు.

టీడీపీ కార్యకర్త మృతికి సంతాపం

రొళ్ల మండలంలో హెచ్‌టీ హళ్లికి చెందిన తెలుగుదేశం పార్టీ కార్యకర్త రాజన్న అనారోగ్యంతో మృతి చెందాడు. విషయం తెలుసుకొన్న మాజీ ఎమ్మెల్యే ఈరన్న తనయుడు డాక్టర్ సునీల్ రాజన్న భౌతికకాయంపై పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈసందర్భంగా టీడీపీ నాయకులు ఉన్నారు.

టీడీపీలోకి 150 కుటుంబాల చేరిక

కదిరి: పట్టణంలోని నిజాంవలీ కాలనీకి చెందిన సుమారు 150 కుటుం బాల వారు వైసీపీని వీడి టీడీపీలోకి చేరారు. కాలనీలో ఆదివారం వారు 14వార్డు కౌన్సిలర్ మహబూబ్‌బాషా, మాజీ కౌన్సిలర్ జిలాన్, తెలుగుయువత జిల్లా అధ్యక్షుడు బాబ్‌జాన్ ఆధ్వర్యంలో, నియోజకవర్గ ఇన్‌చార్జి కందికుంట వెంకటప్రసాద్, నాయకుడు పవన్‌కుమార్ రెడ్డి సమక్షంలో టీడీపీ తీర్థం పుచ్చుకున్నారు. వారికి కందికుంట కండువాలు వేసి పార్టీలోకి సాదరంగా ఆహ్వానించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ వచ్చే ఎన్నికల్లో టీడీపీ విజ యానికి ప్రతిఒక్కరూ సైనికుల్లా పని చేయాలని సూచించారు. కష్టపడిన వారికి పార్టీ తగిన గుర్తింపు ఇస్తుందని తెలిపారు. కార్యక్రమంలో నాయకులు బంగారు కృష్ణమూర్తి, హిదాయత్, విశ్వనాథ్, సులేమాన్, అయూబ్, నాయ కులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

పోలీస్ స్టేషన్ తనిఖీ చేసిన డీఎస్పీ



రికార్డులు పరిశీలిస్తున్న డీఎస్పీ బాజీజాన్ సాహిద్

అగళి, ఫిబ్రవరి 4 : స్థానిక పోలీస్ స్టేషన్‌ను ఆదివారం రాత్రి పెనుకొండ డీఎస్పీ బాజీజాన్ సాహిద్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. పెనుకొండ డీఎస్పీగా బాధ్యతలు చేపట్టిన తొలిసారి ఆయన అగళి పోలీస్ స్టేషన్‌ను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా స్టేషన్‌లోని రికార్డులను పరిశీలించి, కేసుల వివరాలపై ఎస్ఐ వీరేష్‌ను అడిగి తెలుసుకున్నారు. మండలంలో అసాంఘిక కార్యకలాపాలను అరికట్టేందుకు చర్యలు తీసుకోవాలన్నారు. ఎన్నికలు సమీపిస్తుండడంతో కర్ణాటక మద్యం రవాణాపై దృష్టి సారించాలన్నారు. గ్రామాల్లో ఎటువంటి అవాంచ నీయ సంఘటనలు జరుగకుండా చర్యలు చేపట్టాలని ఎస్ఐని ఆదేశించారు.

భక్తి శ్రద్ధలతో తండులార్చన



తండులార్చనలో పాల్గొన్న మహిళలు, బాలికలు

పెనుకొండ, ఫిబ్రవరి 4 : స్థానిక సత్యసాయి భజన మంది రం సేవా సమితి ఆధ్వర్యంలో మ హిళలు, పిల్లలు ఆదివారం భక్తి శ్రద్ధలతో తండులార్చ నను నిర్వ హించారు. ఉదయం భజన మందిరంలో స్వామివారికి ప్రత్యేక పూజలు చేశారు. హారతులిచ్చి అర్చన కార్యక్రమం చేపట్టారు. ఈ కార్యక్రమంలో 75మంది మహిళ లు, పిల్లలు భక్తి శ్రద్ధలతో విశ్వ శాంతి కోరుతూ స్వామివారికి తండులార్చన చేసినట్లు వారు తెలిపారు.

షర్మిల రాకతో జగన్‌లో ఓటమి భయం

కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర నేత జంగా గౌతమ్



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న జంగా గౌతమ్

మడకశిరటౌన్, ఫిబ్రవరి 4: ఏపీసీసీ అధ్యక్షురాలిగా షర్మిల బాధ్యతలు చేపట్టగానే జగన్‌కు వణుకు ఎందుకు అని ఆ పార్టీ వర్కింగ్ కమిటీ రాష్ట్ర అధ్యక్షుడు జంగా గౌతమ్, పీసీసీ జనరల్ సెక్రెటరీ రామకృష్ణ ప్రశ్నించారు. సీఎం జగన్‌లో, వైసీపీలో ఓటమి భయం మొదలయిందన్నారు. వారు ఆదివారం మడకశిరకు వచ్చిన సందర్భంగా స్థానిక ప్రెస్‌క్లబ్‌లో మాజీ ఎమ్మెల్యే సుధాకర్‌తో కలిసి విలేకరుల సమావేశంలో మాట్లాడారు. ముఖ్యమంత్రి జగన్ మోహన్‌రెడ్డికి భవిష్యత్తు కనిపిస్తోందని, తనకు అపజయం తప్పదని షర్మిలపై సొంత పత్రిక, టీవీ, సోషియల్ మీడియాలో ట్రోల్ చేయిస్తున్నారన్నారు. షర్మిలపై మంత్రులు వ్యక్తిగత విమర్శలు చేయడం వారికి ఓటమి భయం పట్టుకునే అన్నారు. మడకశిరకు వచ్చిన మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి షర్మిలపై విమర్శలు చేశారని, మంత్రిగా రాయలసీమకు ఆయన ఏం చేశారని ప్రశ్నించారు. ఎన్నికల మునుపు హామీ ఇచ్చిన విధంగా హంద్రీనీవా కాలువ ద్వారా రాయలసీమలోని చెరువులకు నీరు నింపారా? ఏ ఒక్క ప్రాజెక్టునైనా నిర్మించగలిగారా అని ప్రశ్నించారు. గతంలో రాజశేఖర్‌రెడ్డి క్యాబినెట్‌లో పనిచేసిన మంత్రులు ప్రస్తుతం జగన్ క్యాబినెట్‌లో ఉన్నారని, అప్పుడు రాష్ట్రంలో జరిగిన అభివృద్ధి, ప్రస్తుత పరిస్థితిపై చర్చకు మంత్రులు సిద్ధమా అంటూ సవాల్ విసిరారు. ముఖ్యమంత్రి జగన్, మంత్రులు కాంగ్రెస్ పార్టీని చచ్చిన శవం అని అంటున్నారని, మరి షర్మిలపై ఎందుకు విమర్శ లు చేస్తున్నారని అన్నారు. దాదాపు 31 మంది ఎంపీలను పెట్టుకొని పునర్ వ్యవస్థీకరణ చట్టంలో పొందుపర్చిన ప్రత్యేకహోదా, ఇతర హామీలు ఎందుకు సాధించలేకపోయారన్నారు. మీరు కేంద్రంలో బీజేపీ ప్రభుత్వానికి దాసోహం అయ్యారా అని ప్రశ్నించారు. జగన్, మంత్రులు ఎన్ని కుట్రలు పన్నినా కాంగ్రెస్ పార్టీ షర్మిలకు అండగా ఉంటుందన్నారు. ఇప్పటికైనా సోషల్ మీడియాలో ట్రోలింగ్ చేయడం ఆపాలన్నారు. ఈసందర్భంగా కాంగ్రెస్ పార్టీ నాయకులు ప్రభాకర్‌రెడ్డి, నాగరాజు, బాబు, తదితరులు ఉన్నారు.

రాయదుర్గం - తుమకూరు మార్గానికి రూ.250కోట్లు కేటాయింపు

నైరుతి రైల్వే ముఖ్య సమాచార అధికారి మంజునాథ్ కనుమడి



కే రాంపురం వరకు పూర్తయిన రైల్వేలైన్ నిర్మాణం

పావగడ, ఫిబ్రవరి 4: ఆంధ్రాలోని రాయదుర్గం నుంచి కర్ణాటకలోని తుమ కూ రుకు రైల్వే మార్గం నిర్మించ డానికి 2024-25 బడ్జెట్‌లో కేంద్రప్రభుత్వం రూ.250కోట్ల నిధులను కేటాయించినట్లు నైరుతి రైల్వే ముఖ్య సమాచార అధికారి డాక్టర్ మంజునాథ్ కనుమడి తెలియ జేశారు. 200 కిలోమీటర్ల తుమ కూరు-రాయదుర్గం రైల్వే మార్గం నిర్మాణానికి 2011 సంవత్స రంలో కేంద్ర ప్రభుత్వం రూ.800కోట్ల నిధులను కేటాయించింది. దాదాపు 13 సంవత్సరాలుగా నిర్మాణ పనులు జరుగుతున్నాయి. ఇప్పటికి రాయదుర్గం నుంచి కర్ణాటకలోని పావగడ తాలూకా కే రాంపురం వరకు 80 కిలోమీటర్ల రైల్వే మార్గం పనులను పూర్తి చేశారు. దీంతో ఇటీవల కే రాంపురం వరకు రైలు సంచారం జరుగుతోంది. అయితే కే రాంపురం నుంచి పావగడ, మడకశిర, మధుగిరి, కొరటగెరె, తుమ కూరు వరకు రైల్వే పనులు వేగవంతం కాకపోవ డంతో ఎక్కడి పనులు అక్కడే నిలిచిపోయాయి. పావగడ సరిహద్దులోని నాగలాపురం నుంచి మడకశిర సరిహద్దు ప్రాంతమైన కర్ణాటక ప్రాంతంలోని రాజవంతి వరకు 35 కిలోమీటర్లు రైల్వే పనులకు సంబంధించి ఇప్పటి వరకు కొన్ని చోట్ల భూసేకరణ ప్రక్రియ కూడా జరుగలేదు. దీంతో రైల్వే పనులు పూర్తిగా ని లిచిపోయాయి. పావగడ నుంచి 15 కిలోమీటర్లు రైల్వే పనులు చేపట్టడానికి మాజీ ఎమ్మెల్యే వెంకటరమణప్ప, కేంద్ర మంత్రి నారాయణస్వామి కాంట్రాక్టర్లను నియమించారు. నిధుల కొరత వల్ల పనులు ఎక్కడికక్కడే నిలిచిపోయాయని రైల్వే కాంట్రాక్టర్లు తెలిపారు. ఆంధ్ర ప్రాంతంలో రైల్వే ప నులు పూర్తి అయి కర్ణాట కలో జరగడం లేదం టే ఇక్కడి ప్రజా ప్ర తినిధులు, అధికారులు, కాంట్రాక్టర్ల నిర్లక్ష్యానికి నిదర్శనమని తాలూకాలోని పలువురు విమర్శిస్తున్నారు.

ఆలయ కమిటీ సమావేశానికి మహిళా డైరెక్టర్ల డుమ్మా



ఆలయంలో కమిటీ సమావేశం నిర్వహిస్తున్న దృశ్యం

లేపాక్షి, ఫిబ్రవరి 4 : ప్రపంచ ప్రసిద్ధిగాంచిన లేపాక్షిలోని దుర్గా, వీరభద్ర స్వామి ఆలయానికి ఇటీవల నూతనంగా కమిటీని ఏర్పాటు చేశారు. ఏడుగురు సభ్యులతో కమిటీ ఏర్పాటు అయింది. వారిలో నలుగురు పురుషులు, ముగ్గురు మహిళలు సభ్యులుగా ఉన్నారు. కమిటీ సభ్యులు మొత్తం అధికార పార్టీకి చెందిన వారే కావడం గమనార్హం. ఈ క్రమంలో ఆలయ పరిపాలన వ్యవస్థ, భక్తులకు కల్పించాల్సిన సౌకర్యాలపై ఆదివారం మొదటి సమావేశం నిర్వహించారు. అయితే ఆలయ ప్రాంగణంలో జరిగిన ఈ సమావే శానికి మహిళా డైరెక్టర్లు శాంతమ్మ, మంజుల, సాయిలీల గైర్హాజరయ్యారు. సాయిలీల స్థానంలో ఆమె భర్త మదన్, మంజుల స్థానంలో ఆమె భర్త గోపి హాజరయ్యారు. సమావేశంలో వీరే హల్‌చల్ చేశారు. దీనిపై ఆలయ కమిటీ ఛైర్మన్ మాట్లాడకపోవడం విచారకరమని గ్రామస్థులు అంటున్నారు. ఆలయ అభివృద్ధికి కృషిచేయాల్సిన మహిళా డైరెక్టర్లు మొదటి సమావేశానికే డుమ్మా కొట్టడం, వారి స్థానంలో బంధువులు హాజరు కావడంపై మండల ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. జరగబోయే సమావేశాలకైనా డైరెక్టర్లే హాజరు కావాలని కోరుతున్నారు. అయితే దీనిపై అధికారులు సైతం నోరు మెదపకపోవడం గమనార్హం.

సబ్ జైలు తనిఖీ



సబ్‌జైలులో ఖైదీలతో మాట్లాడుతున్న ఇన్‌చార్జి కార్యదర్శి దీన

పెనుకొండ, ఫిబ్రవరి 4 : స్థానిక సబ్‌జైలును జిల్లా న్యాయ సేవాధికార సంస్థ ఇన్‌చార్జి కార్యదర్శి దీన తనిఖీ చేశారు. హైకోర్టు ఆదేశాల మేరకు పెనుకొండ సబ్‌జైలును ఆదివారం తనిఖీచేసిన ఇన్‌చార్జ్ కార్యదర్శి దీన సబ్‌జైలులో మౌలిక వసతులపై ఆరాతీశారు. బాల కార్మికులు ఎవరైనా ఉన్నారా అని సూపరింటెండెంట్ ను అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఖైదీలతో మాట్లాడుతూ... సబ్‌జైలులో ఖైదీలకు మౌలిక సదుపా యాలు, భోజన వసతులు తదితర విషయాలను అడిగి తెలుసుకున్నారు. ఈ కా ర్యక్రమంలో ఇన్‌చార్జ్ కార్యదర్శి వెంట సబ్‌జైలు సూపరింటెండెంట్ అజ్గర్‌హుస్సేన్, ప్యానల్ అడ్వకేట్ మోహన్‌నాయక్, పారాలీగల్ వలంటీరు నరసప్ప, జిల్లా న్యాయసేవా సదన్ సిబ్బంది మండల లీగల్‌సెల్ సర్వీసెస్ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

గ్రామాల్లో తాగునీటి ఎద్దడి



కల్లురొప్పం సమీపాన నీటి కోసం తోటలో గుమిగూడిన గ్రామస్థులు

గుడిబండ, ఫిబ్రవరి 4 : మండలంలోని కొంకల్లు, చిగతుర్పి, పీగొల్లహట్టి, హిరేతుర్పి, కల్లు రొప్పం తదితర గ్రామాల్లో తా గునీటి ఎద్దడి నెలకొంది. దీంతో వ్యవసాయ బోరు బావు లను ఆశ్రయించి తాగునీటిని తెచ్చుకుం టున్నామని గ్రామస్థులు వాపోతున్నారు. భూగర్భ జలాలు అడుగంటి, బోర్లలో నీరురాకపోవడంతో తాగునీటి సమస్య తీవ్రంగా ఉందని... నీటి కోసం పనులు వదులుకుని కాపుకాయాల్సిన పరిస్థితి ఏర్పడిందన్నారు. అధికారులు వెంటనే చొరవ తీసుకుని తగు చర్యలు చేపట్టాలన వారు కోరుతున్నారు.

తాగునీటి బోరుకు స్టార్టర్ అమరిక

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్



బోరుకు అమర్చిన కొత్త స్టార్టర్

మడకశిర రూరల్, ఫిబ్రవరి 4 : మండలంలోని సీ కోడిగేపల్లి లో తాగునీటి బోరుకు పంచాయితీ అధికారులు ఆదివారం స్టార్టర్ అ మర్చి ప్రజలకు తాగునీటిని అం దించారు. గత నెల 29వ తేదీన ఆంధ్రజ్యోతిలో 'స్టార్టర్‌ను ఎత్తు కెళ్లిన దొంగలు, తాగునీటి కోసం ప్రజల పాట్లు' అనే శీర్షికతో వార్తా కథనం ప్రచురితమైన విషయం విదితమే. కథనానికి అధికారులు స్పందించారు. పంచా యతీలో నిధులు లేకపోయినా ఏదో విధంగా తాగునీటి బోరుకు స్టార్టరు అమర్చి ప్రజలకు తాగునీరు అందించారు.

ఎన్‌ఎస్‌ఎస్ విద్యార్థుల శ్రమదానం



పారిశుధ్య పనులు చేస్తున్న విద్యార్థులు

పెనుకొండ రూరల్, ఫిబ్రవరి 4 : పెనుకొండ నగర పంచాయతీ మంగా పురంలో ప్రభుత్వ జూనియర్ కళాశాల ఆధ్వర్యంలో ఎన్ ఎస్ఎస్ విద్యార్థులు శ్రమదానం చేసిన ట్లు కళాశాల ఎన్ఎస్ఎస్ పీఓ హఫీజ్ ఆదివారం తెలిపారు. ఎన్ఎస్ఎస్ ప్రత్యేక శిబిరంలో భాగంగా గ్రామంలో వీధుల్లోని చెత్తా చెదారం తొలగించి రోడ్డుకు ఇరువైపులా ముళ్లపొదలు తొలగించారు. శుభ్రతపై గ్రామస్థులకు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో ఎన్ఎస్ఎస్ వలంటీర్లు పాల్గొన్నారు.

యువకుడిపై గుర్తుతెలియని వ్యక్తుల దాడి

పావగడ ఆసుపత్రికి తరలింపు - పరిస్థితి విషమం

పావగడ, ఫిబ్రవరి 4: తాలూకాలోని తిరుమణి పోలీస్‌స్టేషన్ పరిధిలో ఉన్న బుగుడూరులో నారాయణరెడ్డి అనే యువకుడిపై గుర్తుతెలియని నలుగు రు వ్యక్తులు శనివారం అర్ధరాత్రి కొడవళ్లతో దాడిచేసి గాయపర్చారు. తిరుమణి పోలీసులు తెలిపిన వివరాల మేరకు... నారాయణరెడ్డి ఊరికి సమీపాన ఉన్న తన తోటలో నిద్రిస్తుండగా గుర్తుతెలియని నలుగురు వ్యక్తులు వేటకొడవళ్లతో విచక్ష ణా రహితంగా దాడి చేశారు. అతడు వారి నుంచి ఎలాగో తప్పించుకొని ఇంటికి చేరుకోగా కుటుంబ సభ్యులు కలిసి వారిని తరిమారు. గాయాల పాలైన బాధితు డు నారాయణరెడ్డిని పావగడ ప్రభుత్వాస్పత్రికి తరలించి ప్రథమ చికిత్సలు అం దించారు. అనంతరం మెరుగైన వైద్యం కోసం బెంగళూరుకు తరలించినట్లు కు టుంబ సభ్యులు తెలిపారు. ఈ మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేప ట్టినట్లు పోలీసులు తెలిపారు. భూ తగాదాలే ఈదాడికి కారణం అయి ఉండవ చ్చని, దర్యాప్తులో పూర్తి వివరాలు తేలాల్సి ఉందని పోలీసులు తెలియజేశారు.